సంపుటి : 9
సంచిక : 328
గురువారం
20 ఆగస్టు 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT


CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999

## ప్రొఫెసర్లు చేయాల్సిన పని కార్మికులతో..

# గ్రూప్ -1లో భయంకరమైన అక్రమాలు



- గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు : అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు
- ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో జవాబు పత్రాలు దిద్దించారని ఆరోపణ
- కోర్టు ఆదేశాలను ధిక్కరించి ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకనం అప్పగించారని ఆగ్రహం
- సీఐడీ కస్టడీలో ఉన్న హాయ్‌లాండ్‌లో వాల్యుయేషన్ జరిపి అక్రమాలకు పాల్పడ్డారన్న సీఎం
- భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ

**అమరావతి, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల్లో కనీవినీ ఎరుగని రీతిలో భారీ కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఉన్నతాధికారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన పరీక్షల జవాబు పత్రాలను ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో దిద్దించారని, ఇంతకంటే బరితెగింపు మరొకటి ఉండదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో నిబంధన 344 కింద బుధవారం జరిగిన చర్చలో చంద్రబాబు ఈ అక్రమాలపై సవివరంగా ప్రసంగించారు. 2018లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించి జరిగిన మూల్యాంకన ప్రక్రియ మొత్తం అక్రమాలకు నిలయంగా మారిందని చంద్రబాబు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి, తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసి మరీ ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని విమర్శించారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, తన స్నేహితులకు, బంధువులకు ఈ ప్రక్రియను కట్టబెట్టారని ఆరోపించారు. పరీక్ష జవాబు పత్రాలను పీడీఎఫ్ రూపంలో ప్రైవేటు జీ-మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌ల ద్వారా పంపి మిగతా .. 2లో..

## ఇంటింటికీ టీడీపీ..

70 లక్షల ఇళ్లకు చేరువగా కార్యక్రమం

తెలుగుదేశం పార్టీ

**అమరావతి, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం – రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహభరితంగా సాగుతోంది. ఈ కార్యక్రమం ప్రారంభమైన 24 రోజుల్లో పార్టీ శ్రేణులు మొత్తం 69.26 లక్షల కుటుంబాలను నేరుగా కలిశారు. బుధవారం 24వ రోజున తాజాగా మరో 2.54 లక్షల మిగతా .. 2లో..

## ఎన్నికలకు సిద్ధంకండి..

# గెలుపే లక్ష్యంగా పని చేయండి

- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా



**తాడేపల్లి, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో మిగతా .. 2లో..

## కుటుంబం గురించే

## ఎక్కువ చెప్పా కానీ..

ఆత్మకథపై సోనియా గాంధీ



**ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** దశాబ్దాలపాటు ప్రజా జీవితంలో ఉన్న కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ.. తన వ్యక్తిగత జీవితం గురించి తొలిసారి మనసు విప్పనున్నారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరిట తన ఆత్మకథను తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. అది నవంబర్ 10న ప్రచురితం కానుంది. ఈ నేపథ్యంలో సోనియా మాటలను ప్రచురణకర్త ఆల్‌ఫ్రెడ్ గుర్తుచేసుకున్నారు. సోనియా అనూహ్యంగా మిగతా .. 2లో..

## ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్

# గూడూరు జంక్షన్ కష్టాలకు చెల్లుచీటి




- గూడూరు-గుమ్మిడిపూండి మధ్య 3, 4వ రైల్వే లైన్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- రూ. 2,229 కోట్ల అంచనా వ్యయంతో 90 కిలోమీటర్ల మేర నిర్మాణం
- గూడూరు జంక్షన్‌లో రద్దీ తగ్గి, మరిన్ని రైళ్లకు అవకాశం
- నాలుగేళ్లలో ప్రాజెక్టు పూర్తి.. కృష్ణపట్నం, శ్రీహరికోటలకు మెరుగవనున్న కనెక్టివిటీ
- నిర్ణయంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హర్షం

**న్యూఢిల్లీ, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం చేకూర్చే కీలకమైన రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. గూడూరు-గుమ్మిడిపూండి మధ్య 90 కిలోమీటర్ల మేర మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,229 కోట్లుగా నిర్ణయించారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం డబుల్ లైన్‌గా ఉన్న ఈ మార్గాన్ని నాలుగు లైన్లుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మిగతా .. 2లో..

## ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుపై నిబంధనలను

# సరళతరం చేస్తూ అసెంబ్లీలో బిల్లు

- భూమి నిబంధన 50 నుంచి 10 ఎకరాలకు తగ్గింపు
- కనీస పెట్టుబడి నిబంధన తొలగింపు, ఎండోమెంట్ ఫీజు రూ. 5 కోట్లకు కుదింపు
- రాష్ట్రంలో 'విష్ణు మహిళా విశ్వవిద్యాలయం' ఏర్పాటుకు ఆమోదం
- 60 రోజుల్లోనే ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో వర్సిటీలకు అనుమతులు



**అమరావతి, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు ప్రక్రియను సరళతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ మేరకు 'ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు 2026'ను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. నిబంధనలను సరళతరం చేసి, ఉన్నత విద్యా రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిగా తీసుకొచ్చిన 'జన్ విశ్వాస్' విధానంలో భాగంగానే ఈ సవరణలు మిగతా .. 2లో..

## అంతరిక్ష పరిశోధనల్లో

## చైనా మరో కీలక ముందడుగు



**ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక ముందడుగు వేసింది. 'జూక్-3' రాకెట్‌ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి పంపి.. తొలి దశ విడిపోయిన అనంతరం తిరిగి భూఉపరితలంపై స్వాధీనం చేసుకుంది. బుధవారం డోంగ్‌ఫెంగ్ వాణిజ్య అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఈ ప్రయోగం చేపట్టింది. దాదాపు 66.1 మీటర్ల పొడవైన ఈ రాకెట్ మొదటి దశ తొమ్మిది ఇంజిన్లు కలిగి మిగతా .. 2లో..

## స్థానిక సంస్థల ఎన్నికల్లో

# తన కూతురు పోటీ చేస్తుందన్న బొత్స


- కుమార్తె పొలిటికల్ ఎంట్రీపై కీలక ప్రకటన చేసిన బొత్స సత్యనారాయణ
- జిల్లా పరిషత్ ఎన్నికల్లో బరిలోకి దింపుతామని వెల్లడి
- అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శ



**అమరావతి, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** తన కుమార్తె అనూష రాజకీయ అరంగేట్రంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక ప్రకటన చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె పోటీ చేస్తుందని ఆయన వెల్లడించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దించుతున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూటమి ప్రభుత్వంపై బొత్స తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శాసనసభలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని, బయట మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. డీఎస్సీ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మిగతా .. 2లో..

# కొత్త పార్టీ పెడుతున్నా..

- తిరుమలలో విజయసాయి రెడ్డి కీలక ప్రకటన
- వైసీపీలోకి రీఎంట్రీపై ఊహాగానాలకు తెరదించిన విజయసాయి రెడ్డి
- ఈ నెలలోనే విజయవాడలో పార్టీ ప్రణాళికను వెల్లడిస్తానని స్పష్టీకరణ
- ప్రజల పక్షాన గొంతుకగా నిలుస్తానని, సరికొత్త రాజకీయానికి శ్రీకారం చుడతానని వెల్లడి



**తిరుమల, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి తన రాజకీయ పునః ప్రవేశంపై నెలకొన్న సందిగ్ధతకు తెరదించారు. వైసీపీలోకి తిరిగి వెళ్తారంటూ జోరుగా సాగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ, సొంతంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తన కొత్త పార్టీకి శ్రీవారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మిగతా .. 2లో..

## సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల కోసం

# ముమ్మరంగా గాలింపు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పర్యవేక్షణలో సహాయక చర్యలు



**అమలాపురం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన మిగతా .. 2లో..




## రానున్న ఎన్నికల్లో

# పరకాల నుంచే పోటీ చేస్తా

కొండా సుస్మితా పటేల్



**గీసుగొండ, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న ఎన్నికల్లో పరకాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ స్పష్టం చేశారు. బుధవారం దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను మిగతా .. 2లో..

## అరుణాచల్‌లో చైనా ఆక్రమణ వార్తలు..

# ఖండించిన కిరణ్ రిజిజు



**ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అరుణాచల్ ప్రదేశ్‌లోని లాంగ్జు సమీపంలో చొరబాట్లకు పాల్పడిందని, అక్కడ సైనిక శిబిరాలను ఏర్పాటు చేసిందని ప్రచారం అవుతున్న కథనాలను కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. భూభాగాన్ని ఎవరూ ఆక్రమించుకోలేదని.. సరిహద్దు వెంబడి భారత సైన్యం, ఇండో-టిబెటన్ బోర్డర్ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## గ్రూప్-1లో భయంకరమైన అక్రమాలు

వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. సీఐడీ స్వాధీనంలో ఉన్న హాయ్‌ల్యాండ్‌లో 84 రోజుల పాటు అనధికారికంగా జవాబు పత్రాలను ఉంచి మూల్యాంకనం చేశారని, దీని కోసం రూ. 1.19 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు, చేర్పులు జరిగాయని, వైట్‌నర్ కూడా వినియోగించారని ఫోరెన్సిక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. మూల్యాంకన కేంద్రంలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు లేకుండా చేసి, మొబైల్ ఫోన్లను అనుమతించి అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారం రాష్ట్ర యువత భవిష్యత్తుతో ఆడుకోవడమేనని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గత పాలనలో జరిగిన అతిపెద్ద కుంభకోణాలలో ఒకటని, దీనిపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా, ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా కఠిన శిక్ష తప్పదని శాసనసభ వేదికగా హెచ్చరించారు. వేల సంఖ్యలో నకిలీ ఓఎంఆర్ షీట్లు ముద్రించడం నుంచి జవాబు పత్రాలను మార్చేయడం వరకు అనేక అక్రమాలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయని చంద్రబాబు వివరించారు. కొత్త ఛైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ ఎవాల్యుయేషన్‌కు ఆదేశించడంతోనే ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. సుమారు 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులను ఒక ప్రైవేట్ సంస్థలో ముద్రించారని, ఎగ్జామినర్ల జాబితాను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేశారని ఆరోపించారు. జవాబు పత్రాల్లో వేర్వేరు చేతిరాతలు, ఓవర్ రైటింగ్‌లను గుర్తించామన్నారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు జరిగినట్లు తేలిందని, 21 స్లిప్పులపై ఎలాంటి సంతకాలు లేవని పేర్కొన్నారు. జవాబు పత్రాలు దిద్దే గదిలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు నిలిపివేయడమే కాకుండా, మొబైల్ ఫోన్లను కూడా అనుమతించారని తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రాసిన అభ్యర్థినే మూల్యాంకనానికి ఎగ్జామినర్‌గా నియమించడం ఈ అక్రమాలకు పరాకాష్ట అని విమర్శించారు. గత పాలనలో బరితెగించి చేసిన అతిపెద్ద కుంభకోణం ఇది అని చంద్రబాబు అభివర్ణించారు. “తప్పు జరగలేదని చెప్పే ధైర్యం వారికి ఉందా?” అని ప్రశ్నించారు. జరిగిన దుర్మార్గాన్ని విశ్లేషించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవస్థలు కేవలం వ్యక్తుల కోసం కాదని, యువత భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రజలు, మేధావుల నుంచి అభిప్రాయాలు స్వీకరించి పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

## ఇంటింటికీ టీడీపీ..

ఇళ్లను సందర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో, చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో వారి అభిప్రాయాలను సేకరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇంటింటి పర్యటనలో భాగంగా ప్రభుత్వ పథకాల అమలు తీరును ప్రజలకు వివరిస్తూనే, వారు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలపై ఆరా తీస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న సూచనలు, సలహాలను పార్టీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ, వాటిని స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, వారి అవసరాలను గుర్తించే పనులు కూడా ఏకకాలంలో జరుగుతున్నాయి. ఇప్పటికే 60 లక్షల గృహాల సందర్శన మైలురాయిని దాటిన ఈ కార్యక్రమం, ప్రస్తుతం 70 లక్షల మార్కుకు చేరువ కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికీ చేరవేస్తూ, ప్రజలతో నిరంతర సంబంధాలను కొనసాగించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్తున్నారు.

## ఎక్కువ చెప్పా కానీ..

రాజకీయాల్లోకి ప్రవేశించారు. అప్పటివరకు ప్రజాజీవితానికి దూరంగా ఉన్న తనను.. హృదయవిదారక ఘటనలు, నష్టాలు రాజకీయాలవైపు లాగాయని సోనియా గుర్తుచేసుకున్నారు. ఈ ఆత్మకథ రాయడం, తన మనసులోతుల్లో దాచుకున్న అనుభవాలను రాబట్టడం అంత సులువుగా జరగలేదన్నారు. తన ప్రయాణంలోని ఆనందాలు, నిరాశల సమాహారమే ఈ పుస్తకం అని పేర్కొన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జీవిత భాగస్వామిగా, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతగానే సోనియాగాంధీ అందరికీ సుపరిచితురాలు. రాజీవ్‌తో ప్రేమ, పెళ్లి, భారత్‌కు రావడం, ఇలా తన జీవితానికి సంబంధించి ఎన్నో విశేషాలను ఈ పుస్తకం రూపంలో సోనియా వెల్లడించనున్నారు. తన అత్త, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య, ఆ తర్వాత భర్త రాజీవ్‌గాంధీ హత్య తన జీవితాన్ని ఎలా మార్చాయో పుస్తకంలో ప్రస్తావించారు.

## చైనా మరో కీలక ముందడుగు

ఉంది. ప్రయోగం అనంతరం తొలి దశ విడిపోయి గాన్సు ప్రావిన్స్‌లోని మిన్‌చిన్ కౌంటీలో సురక్షితంగా ల్యాండ్ అయింది. రాకెట్ తొలి దశను చైనా తిరిగి స్వాధీనం చేసుకోవడం ఇది రెండోసారి అయినప్పటికీ.. భూమిపై విజయవంతంగా ల్యాండ్ చేయడం ఇదే తొలిసారి. ఈ ఏడాది జులై 10న ‘లాంగ్ మార్చ్-10బీ’ రాకెట్ తొలి దశ సముద్రంలో ల్యాండ్ అయింది. తాజా ప్రయోగంలో భూ ఉపరితలంపైనే స్వాధీనం చేసుకున్నారు. అమెరికాకు చెందిన స్పేస్‌ఎక్స్, బ్లూ ఆరిజిన్ సంస్థలు 2015 నుంచే రాకెట్ తొలి దశలను తిరిగి ల్యాండ్ చేసి పునర్వినియోగిస్తున్నాయి. రాకెట్ పునర్వినియోగం వల్ల ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది.

## గెలుపే లక్ష్యంగా పని చేయండి

శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

## గూడూరు జంక్షన్ కష్టాలకు చెల్లుచీటి

ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, మరిన్ని ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపేందుకు వీలవుతుందని వివరించారు. దేశంలో అత్యంత రద్దీగా ఉండే చెన్నై-కోల్‌కతా, ఢిల్లీ-చెన్నై మార్గాలతో పాటు వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుంది. ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించడంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తిరుపతి ఎంపీ గురుమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఈ అదనపు ట్రాక్‌లు ప్రాంతీయ అభివృద్ధికి, ప్రగతికి బాటలు వేస్తాయని పవన్ కల్యాణ్ పేర్కొంటూ కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపినందుకు రైల్వే మంత్రికి ఎంపీ గురుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రాజెక్టుతో చేకూరే ప్రయోజనాలు**

ఈ ప్రాజెక్టు పూర్తయితే గూడూరు జంక్షన్‌లో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుంది. చెన్నై, విజయవాడ, తిరుపతి వైపు వెళ్లే రైళ్ల రాకపోకలు సులభతరం అవుతాయి. ముఖ్యంగా పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రం, శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్, కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ వంటి కీలక ప్రాంతాలకు అనుసంధానం మెరుగుపడుతుంది. ప్రాజెక్టులో భాగంగా స్వర్ణముఖి నదిపై 360 మీటర్ల మెగా బ్రిడ్జితో సహా 21 ప్రధాన వంతెనలు, 127 చిన్న వంతెనలు నిర్మించనున్నారు. సుమారు నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల ఏటా అదనంగా 21 మిలియన్ టన్నుల సరుకు రవాణా సామర్థ్యం పెరగడంతో పాటు, దాదాపు 61 లక్షల పనిదినాల ఉపాధి లభిస్తుందని అంచనా. పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు, మల్టీమోడల్ కనెక్టివిటీని మెరుగుపరచనుంది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తం రూ.9,450 కోట్ల వ్యయంతో చేపట్టిన నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులలో ఇది ఒకటి. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే దేశంలోని తూర్పు, దక్షిణ కారిడార్లలో సరుకు, ప్రయాణికుల రవాణా సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది.

## సరళతరం చేస్తూ అసెంబ్లీలో బిల్లు

చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అన్ని రంగాలకు విస్తరింపజేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఉన్నత విద్యా రంగంలో నియంత్రణలను సులభతరం చేస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో వర్సిటీల సంఖ్య తక్కువగా ఉందని, ఈ సవరణల ద్వారా కొత్త సంస్థలను ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఈ బిల్లులో పలు కీలక సవరణలు ప్రతిపాదించారు. ప్రధానంగా, ప్రైవేటు వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని 50 ఎకరాల నుంచి సీఆర్డీఏ, విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో 10 ఎకరాలకు, ఇతర ప్రాంతాల్లో 15 ఎకరాలకు తగ్గించారు. కనీస పెట్టుబడి నిబంధనను పూర్తిగా తొలగించి, కేసును బట్టి నిపుణుల కమిటీ నిర్ణయం తీసుకునేలా మార్పు చేశారు. ఎండోమెంట్ ఫీజును రూ.5 కోట్లకు పరిమితం చేశారు. బ్రౌన్‌ఫీల్డ్ వర్సిటీగా మారాలంటే యూజీసీ నిబంధనల ప్రకారం కనీసం 3.01 సీజీపీఏ తప్పనిసరి చేశారు. ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలో రెండో మహిళా విశ్వవిద్యాలయంగా ‘విష్ణు మహిళా విశ్వవిద్యాలయం’ ఏర్పాటుకు మార్గం సుగమమైందని మంత్రి తెలిపారు. మా ప్రభుత్వ విధానం ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’ అని, దరఖాస్తుల ప్రక్రియను 60 రోజుల్లో పూర్తి చేసేలా ఫాస్ట్ ట్రాక్ విధానాన్ని ఆన్‌లైన్‌లో తీసుకొస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ వంటి 22 పారిశ్రామిక క్లస్టర్లకు అనుగుణంగా వర్సిటీలలో పరిశోధనలను ప్రోత్సహించడమే లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా, పరిశ్రమలకు అనుసంధానంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే ఈ సవరణల ముఖ్య ఉద్దేశమని మంత్రి వివరించారు.

## తన కూతురు పోటీ చేస్తుందన్న బొత్స

రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక సమయంలో అధికార పక్షం బయటకు వెళ్లడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని, రాష్ట్ర చరిత్రలోనే ఇదొక కొత్త విపరీత సంప్రదాయమని విమర్శించారు. ఐదు కోట్ల మంది ప్రజలకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కొత్త పార్టీ పెడుతున్నా..

విజయసాయి రెడ్డి వివరించారు. ప్రజల పక్షాన బలమైన గొంతుకను వినిపించేందుకే కొత్త పార్టీ పెడుతున్నానని స్పష్టం చేశారు. పార్టీకి సంబంధించిన పూర్తి వివరాలు, భవిష్యత్ కార్యాచరణను ఈ నెలలోనే విజయవాడలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడిస్తానని తెలిపారు. దేశం ఎల్‌నినో ప్రభావం లేకుండా సుభిక్షంగా ఉండాలని కూడా స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. గతేడాది తన రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయి రెడ్డి, ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, కొన్ని నెలలకే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. రాజకీయాల్లోకి తిరిగి వస్తానని, సొంతంగా ఒక మీడియా సంస్థను కూడా ప్రారంభిస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. అప్పటి నుంచి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ పలు జాతీయ, రాష్ట్ర అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఆయన తిరిగి వైసీపీ గూటికి చేరతారనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలోనే ఆయన స్పందిస్తూ.. తనది స్వతంత్ర భావజాలమని, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా నిర్ణయం తీసుకుంటానని ట్విట్టర్ వేదికగా స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ‘భారత్ జన వికాస్’ పేరుతో ఆయన పార్టీ పెట్టబోతున్నారంటూ సోషల్ మీడియాలో చర్చ జరిగింది. తాజాగా తిరుమలలో ఆయన చేసిన ప్రకటనతో ఈ ఊహాగానాలకు తెరపడింది. త్వరలోనే సొంత జెండాతో ఏపీ రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ఖాయమైంది.

## ముమ్మరంగా గాలింపు

ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయక, గాలింపు చర్యలను కొనసాగిస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలోని ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ వద్ద జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవి, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ మాధుర్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు, మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్‌లతో కలిసి మంత్రి క్షేత్రస్థాయి పరిస్థితిని సమీక్షించారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు భరోసా కల్పిస్తూ గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం, పోలీస్, మెరైన్ విభాగాలు భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్‌తో నిరంతరం సమన్వయం చేసుకుంటూ గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ఆగస్టు 3న ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లారు. కోపనాతి రామకృష్ణ, కొల్లాటి యేసుదాసు, పాలేపు సంతోషరావు, కర్రి రాంబాబు, కొల్లాటి శ్రీనుబాబు, సంగడి తాతారావు, పోనాడి సతీష్‌లు బోటులో ఉన్నారు. వీరంతా అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలకు చెందినవారని కుటుంబ సభ్యులు తెలిపారు. సాధారణంగా పది రోజుల్లో తిరిగి వస్తామని కుటుంబ సభ్యులకు చెప్పి సముద్రంలోకి వెళ్లినప్పటికీ నిర్ణీత గడువు దాటినా బోటు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 17న పోలీసులకు ఫిర్యాదు చేయగా, జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ వెంటనే స్పందించి గాలింపు చర్యలు ప్రారంభించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్‌గార్డ్‌కు చెందిన ఐదు నౌకలు, భారత నౌకాదళానికి చెందిన రెండు నౌకలు, రెండు అత్యాధునిక విమానాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. సుమారు 300 నాటికల్ మైళ్ల పరిధిలో సముద్ర ప్రాంతాన్ని జల్లెడ పడుతూ బోటు, మత్స్యకారుల ఆచూకీ కోసం నిరంతరంగా శోధన కొనసాగుతోంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్, అసోం తదితర తీర ప్రాంతాల రక్షణ విభాగాలకు సమాచారం అందించి సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు. తాజాగా ఒడిశాలోని పారాదీప్‌కు సుమారు 15 నాటికల్ మైళ్ల దూరంలో పసుపు రంగులో ఉన్న ‘ముత్యాలమ్మ’ పేరుతో కూడిన బోటును గుర్తించినట్లు సమాచారం అందింది. దీంతో అధికారులు అప్రమత్తమై, గుర్తించిన బోటు గల్లంతైన మత్స్యకారుల బోటేనా అనే విషయాన్ని నిర్ధారించేందుకు ప్రత్యేక బృందాన్ని పంపించారు. గల్లంతైన బోటులో సుమారు 1,000 లీటర్ల డీజిల్, దాదాపు 20 రోజులకు సరిపడా ఆహార పదార్థాలు ఉన్నట్లు అధికారులకు సమాచారం ఉంది. ప్రస్తుతం సముద్ర వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలంగా ఉండటంతో మత్స్యకారులు క్షేమంగా ఉండే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులతో జిల్లా యంత్రాంగం నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తోందని మంత్రి తెలిపారు. గాలింపు చర్యల్లో లభిస్తున్న తాజా సమాచారాన్ని కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని చెప్పారు. మత్స్యకారులను సురక్షితంగా గుర్తించి ఒడ్డుకు చేర్చే వరకు గాలింపు, రక్షణ చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఏడుగురు మత్స్యకారులను సురక్షితంగా రక్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, మత్స్యశాఖ, భారత నౌకాదళం, కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసులు, తీర ప్రాంత రక్షణ విభాగాలు సమన్వయంతో గాలింపు, రక్షణ చర్యలను కొనసాగిస్తున్నాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఆర్డీవో ఎ. సరళావతి, అముడ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సీహెచ్. శ్రీనివాస్, మత్స్యశాఖ జేడీ కరుణాకర్, మత్స్యశాఖ ఏడీ రమణారావు, ఎఫ్‌డీవో శివరామకృష్ణ, ఎమ్మార్వోలు, కూటమి నాయకులు, మత్స్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరకాల నుంచే పోటీ చేస్తా

గీసుకొండలో కొండా అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుస్మితా పటేల్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ టికెట్ ఇవ్వకుంటే ఇండిపెండెంట్‌గా పరకాల నుంచే బరిలో దిగుతానని అన్నారు.


## ఖండించిన కిరణ్ రిజిజు

పోలీసులు గస్తీని గణనీయంగా పెంచారని పేర్కొన్నారు. ‘లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్’ సమీపంలో చైనా నిర్మాణాలు చేపడుతున్న ప్రాంతం 1959లోనే ఆ దేశం ఆక్రమించుకున్న భూభాగంలో ఉందని స్పష్టం చేశారు. చైనా దళాలు మన గ్రామాలను ఆక్రమించుకొని, శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. ఎల్ఏసీకి సంబంధించి స్పష్టమైన సరిహద్దు గుర్తింపు లేకపోవడం వల్ల లాంగ్జు ప్రాంతం చాలా కాలంగా వివాదాస్పదంగా ఉందని రిజిజు పేర్కొన్నారు. ఆ సరిహద్దు పాయింట్ వద్ద మన పోస్ట్ కూడా ఉందన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు చేయడం వల్ల అక్కడ మోహరించిన మన సైనిక సిబ్బంది, భద్రతా దళాల మనోధైర్యం దెబ్బతింటుందన్నారు. 1962 భారత్-చైనా యుద్ధం తర్వాత ఆ ప్రాంతంలో ఇరుదేశాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. అయితే అక్కడి పర్వత శ్రేణుల వెంబడి చైనా సైనిక కార్యకలాపాలు పెరిగాయని ధ్రువీకరించారు.

### వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు

## మరో రూ.200 కోట్ల పరిహారం

**బాధితులకు శాసనసభ ప్రాంగణంలో చెక్కు అందించిన సీఎం చంద్రబాబు**
**ఇప్పటివరకు నిర్వాసిత కుటుంబాలకు మొత్తం రూ.518 కోట్లు చెల్లింపు**
**త్యాగాలు చేసిన నిర్వాసితులకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి హామీ**
**ఏడు పునరావాస కాలనీల్లో వేగంగా మౌలిక వసతుల కల్పన**



**అమరావతి, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభానికి సమీపిస్తున్న వేళ, ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా పరిహారం అందించిన ప్రభుత్వం, తాజాగా మరో రూ.200 కోట్ల రూపాయల పరిహారాన్ని విడుదల చేసింది. ఈరోజు శాసనసభ ప్రాంగణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా నిర్వాసిత కుటుంబాల ప్రతినిధులకు ఈ చెక్కును అందజేశారు. ఈ విడుదలతో కలిపి ఇప్పటివరకు వెలిగొండ నిర్వాసితులకు ప్రభుత్వం రూ.518 కోట్ల మేర పరిహారం అందించినట్లయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులు, నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం ఎన్నటికీ మరవదని స్పష్టం చేశారు. “త్యాగం మీది, వారికి అండగా నిలవాల్సిన బాధ్యత మాది. వెలిగొండ నిర్వాసితులను గతంలో ఆదుకున్నది మా ప్రభుత్వమే, ఇప్పుడు కూడా అండగా నిలుస్తున్నాం. మిగిలిన పరిహారాన్ని కూడా వీలైనంత త్వరగా విడుదల చేస్తాం. మంచి చేసే ప్రభుత్వాలను ప్రజలు గుర్తించాలి” అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వం అండగా నిలిచి, తమకు భరోసా కల్పించడం పట్ల నిర్వాసిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రభుత్వానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని వారు తెలిపారు.

**రూ.518 కోట్లకు చేరిన పరిహారం**

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాల్లోని నిర్వాసితులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో భరోసా కల్పిస్తోంది. ఇందులో భాగంగా, సొంతంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) కింద పరిహారం చెల్లిస్తున్నారు. గతంలో 2,557 కుటుంబాలకు ఓటీఎస్ కింద రూ.318 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. తాజాగా మరో 1,600 కుటుంబాలకు రూ.200 కోట్లను అందించింది. దీంతో మొత్తం 4,157 నిర్వాసిత కుటుంబాలకు రూ.518 కోట్ల పరిహారం అందింది. పరిహారంతో పాటు పునరావాసంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. నిర్వాసితుల కోసం మొత్తం 7 పునరావాస కాలనీలను అభివృద్ధి చేస్తుండగా, ఇప్పటికే వేములకోట మినహా మిగిలిన 6 కాలనీలలో మౌలిక సదుపాయాల పనులు పూర్తయ్యాయి. విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి అన్ని వసతులు కల్పించడంతో నిర్వాసిత కుటుంబాలు తమకు కేటాయించిన ఇళ్లకు తరలివెళ్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## వైసీపీలోకి రీ ఎంట్రీ...
## దువ్వాడ ఆశలపై నీళ్లు!

శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో ఎప్పుడూ హాట్ టాపిక్‌గా ఉండే మాజీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పొలిటికల్ ఫ్యూచర్ ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో పడింది. ఒకవైపు అధికార టీడీపీ నేతలపై, ముఖ్యంగా మంత్రి అచ్చెన్నాయుడిపై సోషల్ మీడియా వేదికగా విరుచు కుపడుతూ మళ్లీ పార్టీ అధిష్టానం దృష్టిని ఆకర్షించాలని ఆయన చేస్తున్న ప్రయత్నాలు పూర్తిగా బెడిసికొడుతున్నాయి. ఫ్యాన్ గాలిలో మళ్లీ చక్రం తిప్పాలని ఆయన చేస్తున్న సర్కస్ ఫీట్లపై వైసీపీ పెద్దలు నీళ్లు చల్లినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది.

దువ్వాడ శ్రీనివాస్ రాజకీయ పునరాగమనం వెనుక ప్రధాన అడ్డంకిగా ఆయన వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు మారాయి. గడచిన కాలంలో ఆయన కుటుంబ వివాదాలు రోడ్డెక్కిన తీరు, మీడియా సాక్షిగా నడిచిన వీధి నాటకాలు ఆయన ప్రతిష్టను దారుణంగా దిగజార్చాయి. ప్రజా జీవితంలో ఉన్న నేత ఇలాంటి వివాదాల్లో చిక్కుకోవడం పార్టీకి తీవ్ర మచ్చగా మారుతుందని, మళ్లీ పార్టీలోకి ఆహ్వానిస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఒక వర్గం గట్టిగా భావిస్తోంది.

వ్యక్తిగత వివాదాలతో పాటు ఆయన రాజకీయ శైలి కూడా పార్టీలో ఒంటరి చేసేసింది. జిల్లాలోని ఏ ఒక్క ప్రధాన సీనియర్ నేతతోనూ ఆయనకు సత్సంబంధాలు లేవు. ఎవరి మాట వినకుండా, ఎవరితోనూ సమన్వయం చేసుకోకుండా సొంత నిర్ణయాలతో ముందుకు వెళ్లే నైజం ఆయనను మరింత ఏకాకిని చేసింది. ముఖ్యంగా శ్రీకాకుళం రాజకీయాల్లో బలమైన స్థానం ఉన్న ధర్మాన బ్రదర్స్‌తో పాటు ఇతర కీలక నేతలకు కూడా దువ్వాడతో పడదనే టాక్ ఎప్పటినుంచో ఉంది.

ఇలాంటి నేపథ్యంలో దువ్వాడను మళ్లీ పార్టీలోకి తెచ్చి నెత్తికెత్తుకుంటే, ఉన్న సీనియర్ నేతలు కూడా తీవ్ర అసంతృప్తికి గురయ్యే ప్రమాదముంది. ఒక వివాదాస్పద నేత కోసం పార్టీలో సమన్వయాన్ని కోల్పోలేమని భావించిన అధిష్టానం.. ఆయన ఆవేశపూరిత విమర్శలను, హడావుడిని పూర్తిగా లైట్ తీసుకుంది. దువ్వాడ పోరాటాలకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదనే కఠిన సందేశాన్ని పంపడం ద్వారా ఆయన రీఎంట్రీకి పూర్తిగా చెక్ పెట్టినట్లు స్పష్టమవుతోంది.

మొత్తంగా చూస్తే, దువ్వాడ శ్రీనివాస్ ఎంతగా గొంతుచించుకుని గళం విప్పినా, గడచిన కాలపు వివాదాలు ఆయన రాజకీయ జీవితానికి పెద్ద శాపంగా మారాయి. వైసీపీ తలుపులు పూర్తిగా మూసుకుపోయిన ఈ తరుణంలో ఆయన ఆశలన్నీ ఆవిరైపోయాయి. భవిష్యత్తులో ఆయన తన రాజకీయ ప్రయాణాన్ని ఏ దిశగా నడిపిస్తారనేది ఇప్పుడు శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరంగా మారింది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య..

## 27 సార్లు పొడిచిన నిందితుడు : నల్గొండ ఎస్పీ



**నల్గొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారన్నారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. "రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం. ఆ ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించాం. వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం. రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ బాబు అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నిందితుల్లో ఒకరి వద్ద రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ ఉన్నట్లు గుర్తించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది. నిందితుల్లో ఒకడు అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడు. గతంలో అతడి బ్యాగ్‌లో కొంత డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, టీచర్లు మందలించి డేస్కాలర్‌గా మార్చారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ముందు అతడిని మందలించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్నాడు. నిందితుడికి ఆల్కహాల్ అలవాటు, బైక్‌లపై మోజు ఉంది. నెల క్రితం గోవా టూర్‌కి వెళ్లాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో ఐదురోజుల ముందు నుంచే రూపారెడ్డి ఇంట్లో దొంగతనానికి ప్లాన్ వేసుకున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ వెళ్లాలనే విషయాలపై చర్చించుకున్నారు. ఈనెల 11న స్కూల్ నుంచి వచ్చిన తర్వాత నిందితులు ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ పెట్టుకుని గోడదూకి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో మాస్క్ ఊడిపోవడం, ప్రిన్సిపల్ గుర్తుపట్టడంతో ఆమెను హత్య చేశాడు. 27 సార్లు కత్తితో పొడిచాడు. ఆ సమయంలో ఆమె ఫోన్ కిందపడటంతో దాన్ని తీసుకెళ్లిపోయారు. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదుతో పాటు ఐఫోన్, రూపారెడ్డి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం. నిందితులు మైనర్లు అయినందున వారిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తాం" అని ఎస్పీ వివరించారు.

గచ్చిబౌలి పీఎస్ పరిధిలో

## డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. "ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారించగా డ్రగ్స్ మూలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం. విచారణలో ఓ నైజీరియన్ నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు అతడు తెలిపాడు. బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశాం. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి భారీగా మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నాం. నిందితురాలిని విచారించగా.. కేరళలో ఉండే తన స్నేహితుడు అనేశ్వర్ ద్వారా డ్రగ్స్ సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించింది. పట్టుబడిన నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు మరింత ముమ్మరంగా కొనసాగుతోంది. మాదకద్రవ్యాల సరఫరాపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, సైబరాబాద్ పోలీసుల వాట్సప్ నెంబర్ 8712663061కు ఫిర్యాదు చేయాలి" అని డీసీపీ సూచించారు.

ఏఈ నూకరాజు, సౌజన్య సెల్‌ఫోన్లు..

## డిలీట్ చేసిన మెసేజ్‌లపై పోలీసుల ఆరా



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** పిఠాపురం ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆదివారం నూకరాజు కుటుంబసభ్యులతో కలిసి రాజమహేంద్రవరం వెళ్లిన అనంతరం... ఎవరెవరిని కలిశారు? ఎక్కడెక్కడికి వెళ్లారు? ఏ ప్రాంతంలో ఎంతసేపు ఉన్నారు? అక్కడ ఏం జరిగింది? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మరో వైపు ఈ ఘటనకు కారణమైన సాధిక్ ఖాన్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఏఈ నూకరాజు భార్య మీనా, కుమార్తె సౌజన్య కోసం గోదావరిలో మూడో రోజు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. గోదావరిలో దూకే ముందు వారు ప్రయాణించిన కారులో నూకరాజు, సౌజన్య సెల్ ఫోన్లు ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటి ఆధారంగా దర్యాప్తును వేగవంతం చేశారు. ఆత్మహత్యకు పాల్పడే ముందు వారి సెల్‌ఫోన్లలో వాట్సప్ మెసేజ్‌లను డిలీట్ చేసినట్టు గుర్తించారు. ఇద్దరి మొబైల్ ఫోన్లు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తే కీలక ఆధారాలు లభించే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. మరో వైపు ఏఈ కుటుంబం ఆత్మహత్యకు కారణమైన సాధిక్ ఖాన్ కాల్ డేటాను సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు. నిందితుడి నివాసంతో పాటు అతను నిర్వహిస్తున్న రైఫిల్ షూటింగ్ అకాడమీ, బంధువుల ఇళ్ల వద్ద పోలీసులు నిఘాపెట్టారు. సాధిక్ ఖాన్‌పై రాజమహేంద్రవరం టూటౌన్ సర్పవరం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.










## తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. కఠిన చర్యలకు ఆదేశం!

**కాకినాడ, విశ్వం వాయిస్ క్రైమ్ న్యూస్:** ఆస్తి దోపిడీ.. ఫోన్ ట్యాపింగ్ బ్లాక్‌మెయిలింగ్.. బలవంతపు మతమార్పిడి వేధింపులు.. వరుస హత్యల కుట్రలతో ఒక కామాంధుడు, కిరాతకుడు సాగించిన పైశాచిక కాటుకు ఒక నిండు కుటుంబం గోదావరి నదిలో సమాధి అయిపోయింది. పిఠాపురం పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ (రాజు) టిల్లపూడి నూకరాజు (60) తన కుటుంబంతో సహా రాజమహేంద్రవరం రోడ్-కమ్-రైల్ బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలుగు రాష్ట్రాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. కాకినాడకు చెందిన రైఫిల్ షూటింగ్ అకాడమీ నిర్వాహకుడు షేక్ సాధిక్ ఖాన్ సాగించిన అమానుష ఆగడాలు బాధితుల సెల్ఫీ వీడియోలు, డెత్ నోట్ల ద్వారా వెలుగులోకి వచ్చాయి.

### షూటింగ్ అకాడమీ పేరుతో మొదలైన రాబందు ఉచ్చు

ఏఈ నూకరాజు మనవడు కార్తికేయ రెడ్డి (10) కాకినాడలోని సాధిక్ ఖాన్ రైఫిల్ షూటింగ్ అకాడమీలో చేరడంతో ఈ పరిచయం మొదలైంది. ఆ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని నూకరాజు కుమార్తె సౌజన్య ఫోన్ డేటాను సాధిక్ ట్యాప్ చేశాడు. వ్యక్తిగత అంశాల ఆధారంగా బ్లాక్‌మెయిలింగ్‌కు తెరలేపాడు. తీవ్ర బెదిరింపులతో కోట్ల రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, బ్యాంక్ లాకర్ల తాళాలు, భారీగా నగదును బలవంతంగా లాక్కున్నాడు. అంతటితో ఆగక సౌజన్యను ఇస్లాం మతంలోకి మారాలంటూ తీవ్రంగా వేధించాడు. రోజూ మత గ్రంథాలు చదివించి, రాతపూర్వకంగా రాయించే స్థాయికి ఆ వేధింపులు చేరాయి. మాట వినకుంటే కుటుంబం మొత్తాన్ని మట్టుబెడతానని బెదిరించడంతో ఆ కుటుంబం తీవ్ర మానసిక క్షోభకు గురైంది.

### అల్లుడిది సాధారణ మరణం కాదు.. పాయిజన్ ఇంజెక్షన్ హత్య!

ఈ దారుణ ఉదంతంలో సంచలన కోణం వెలుగుచూసింది. గత జులై 2న మరణించిన నూకరాజు అల్లుడు కొవ్వూరి జగదీశ్వర్ రెడ్డి సహజంగా చనిపోలేదని, అతడికి పాయిజన్ ఇంజెక్షన్ ఇచ్చి సాధిక్ ఖానే హత్య చేశాడని డెత్ నోట్‌లో నూకరాజు, సౌజన్య స్పష్టంగా పేర్కొన్నారు. జగదీష్ తండ్రి భాస్కర్ రెడ్డి కాకినాడ సర్పవరం పోలీసులకు ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదుతో ఈ హత్య మిస్టరీ బయటపడింది. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడు సాధిక్ ఖాన్‌పై బీఎన్ఎస్ సెక్షన్లు 103(1) (హత్య), 108 (ఆత్మహత్య ప్రేరణ), 308(5), 127(1), 351(3), 299 కింద కేసులు నమోదయ్యాయి.

### నలుగురు నదిలోకి దూకిన వేళ.. మనవడి ప్రాణం కాపాడిన ఈత

జీవితంపై విరక్తి చెందిన ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు కార్తికేయ రెడ్డి రాజమహేంద్రవరం రోడ్-కమ్-రైల్ బ్రిడ్జి వద్దకు చేరుకుని గోదావరిలోకి దూకారు. అయితే, బాలుడు కార్తికేయకు ఈత రావడంతో పాటు స్థానిక మత్స్యకారులు వెంటనే రంగంలోకి దిగి అతడిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. తీవ్ర గాలింపు అనంతరం ధోబీ ఘాట్ వద్ద ఏఈ నూకరాజు మృతదేహం లభ్యం కాగా, గల్లంతైన మీనా, సౌజన్యల కోసం SDRF బృందాలు, స్థానిక గజ ఈతగాళ్లు ధవళేశ్వరం బ్యారేజీ పరిసరాల్లో డ్రోన్లతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మృతదేహాలు కొట్టుకుపోకుండా బ్యారేజీ గేట్లను తాత్కాలికంగా మూసివేశారు.

### ఉలిక్కిపడ్డ ప్రభుత్వం.. పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం

పిఠాపురంలో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారి కుటుంబం ఇంతటి దారుణానికి బలికావడంపై స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, పరారీలో ఉన్న నిందితుడు సాధిక్ ఖాన్‌ను తక్షణమే పట్టుకుని అత్యంత కఠినమైన చట్టపరమైన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కాకినాడ, రాజమహేంద్రవరం జిల్లాల సంయుక్త ఆధ్వర్యంలో 10 ప్రత్యేక పోలీస్ బృందాలు నిందితుడు సాధిక్ ఖాన్, ఏఈ కారు డ్రైవర్ కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి.

పోలవరం జిల్లాను

## కరువు జిల్లాగా ప్రకటించాలి

- ఏజెన్సీ ప్రాంతాల్లో నీటి ప్రాజెక్టులు ఎన్ని ఉన్నా భూములకు నీళ్లు ఇవ్వని ప్రభుత్వం
- తక్షణమే ప్రాజెక్ట్‌ల నుండి సాగునీరు విడుదల చెయ్యాలి
- ఏపీ ఆదివాసీ జేఏసీ డిమాండ్



**దేవీపట్నం, ఆగస్టు19, విశ్వం వాయిస్ న్యూస్:** పోలవరం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి లేదా పోలవరం జిల్లాలో ఉన్న భూములకు సాగునీరు పోలవరం జాతీయ ఇరిగేషన్ ప్రాజెక్టు, భూపతి పాలెం ఇరిగేషన్ ప్రాజెక్టు,ముసురు మిల్లి ఇరిగేషన్ ప్రాజెక్టు,మద్ది గడ్డ ఇరిగేషన్ ప్రాజెక్టు మొదలైన నీటి ప్రాజెక్టులు ద్వారా ఆదివాసీ ప్రజల భూములకు సాగునీరు అందించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెల్లం శేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లాలో అనేక సాగునీటి ప్రాజెక్టులు ఉన్న నేటికి ఆదివాసీ ప్రజల భూములకు సాగునీరు అందించటంలో సంబంధిత ప్రాజెక్టుల ఇరిగేషన్ శాఖ అధికారులు కృత్రిమ కరువు సృష్టించి ఆదివాసీ ప్రజలకు ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తూ ఆదివాసీ యువతకు మైదాన ప్రాంతాలకు వలసలకు పరోక్షంగా మార్గం చూపిస్తున్నన్నారు.ఇకనైన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన స్పందించి ఆదివాసీల భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రస్తుతం పోలవరం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర,ఏపీ ఆదివాసీ జేఏసీ మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు, భారత్ ఆదివాసీ పార్టీ స్టీరింగ్ కమిటీ జిల్లా ప్రసార కార్యదర్శి చవలం విద్యాసాగర్ మొదలైన వారు పాల్గొన్నారు.

## సామూహిక ఎలుకల నివారణకు శ్రీకారం

మాచవరం, పసలపూడి, చెల్లూరు, కూర్మాపురం గ్రామాలలో చేపట్టిన కార్యక్రమాలు



**రాయవరం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం మండలంలోని వరి పొలాల్లో ఎలుకల బెడదను నివారించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు. మండలంలోని మాచవరం, పసలపూడి, చెల్లూరు, కూర్మాపురం గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కుర్మాపురం గ్రామంలో నిర్వహించిన సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి కెవిన్ రమేశ్ కుమార్ రైతులకు ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయవరం మండలంలోని పది రెవెన్యూ గ్రామాల్లోని మొత్తం 14,910 ఎకరాల వరి పంటకు అవసరమైన 57 కిలోల బ్రోమోడయోలోన్ రసాయన మందును 19 రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందని వ్యవసాయ అధికారి తెలిపారు. ఎకరానికి నాలుగు గ్రాముల చొప్పున బ్రోమోడయోలోన్‌ను వినియోగించి నూకల ఎరను తయారు చేసుకోవాలని సూచించారు. 100 గ్రాముల విషపు ఎర తయారీలో రెండు గ్రాముల బ్రోమోడయోలోన్, 96 గ్రాముల నూకలు, రెండు గ్రాముల నూనె కలిపి, సజీవ ఎలుక బొరియలో 10 గ్రాముల చొప్పున పొట్లాలు ఉంచాలని సూచించారు. ఎలుకల నివారణలో భాగంగా రైతులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పాల్గొనాలని ఆయన కోరారు.

## ఈ నరకయాతన ఇంకెన్నాళ్లు - కూనవరం గ్రామస్తులు ఆవేదన


### గత ప్రభుత్వంలోనూ, ఎన్డీఏ ప్రభుత్వంలోనూ బస్సు రాని వైనం - రోగం వస్తే ఆసుపత్రికి వెళ్ళినా చస్తాం- వెళ్లకపోయినా చస్తాం



**కోరుకొండ, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** నరక కూపానికి అడ్డదారిగా జిల్లాలోని కోరుకొండ నుండి కూనవరం రహదారి ఉందని కూనవరం గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో కోరుకొండ నుండి మునగాల, కూనవరం మీదికి వెళ్లే సీతానగరం రోడ్డు అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి పనులను అట్టహాసంగా ప్రారంభించారు. నాడు అట్టహాసంగా ప్రారంభించడమే ఆ గ్రామానికి శాపంగా మారిందని, నాటి నుండి నేటి వరకు సుమారు ఏడేళ్లు కావస్తున్నా ఎర్ర బస్సు కాన సరి సరిగద, అనునిత్యం పాదచారులు, వాహనదారులు చుక్కలు చూస్తున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రాత్రి వేళల్లో ఎవరికి ఏ ఆపద వాటిల్లిన ప్రయాణం చేసినా చస్తాం, చెయ్యకపోయినా చస్తాం అన్న నిరాశ నిస్ స్పృహ వ్యక్తం చేస్తున్నారు. పొరపాటున ప్రయాణమై వాహనాల కోసం ఎదురు చూస్తే గంటలు తరబడిన వాహనాలు రావట్లేదని, ఒకవేళ వచ్చిన ప్రధాన రహదారికి చేరుతామన్న ఆశ అడుగంటి పోతుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు పైబడిన నేటికీ ఆ రహదారి వంక చూసిన పాపాన పోలేదన్నారు. ఇక అనునిత్యం విద్యార్థిని విద్యార్థులు, ఆసుపత్రికి వెళ్లే వారి పాట్లు వర్ణాతీతమన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు,



ప్రజా ప్రతినిధులను పలుమార్లు కలిసి వినతి పత్రాలు సమర్పించిన, బుట్ట దాకలవుతున్నా యని పనులు కావట్లేదని యువత ఆవేదన చెందుతున్నారు. ఇక యువత రంగంలోకి దిగి సోషల్ మీడియా ద్వారా కలెక్టర్ తో పాటు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, నా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లే విధంగా పెద్ద మనసుతో సహకరించి, సమస్య పరిష్కారంలో భాగస్వాములు కావాలని కూనవరం యువత, గ్రామస్తులు పలువురిని కోరుతున్నారు.

# సెంట్రల్ డెల్టా ఆధునికీకరణకు రూ.3,000 కోట్లు

**సీఎం చంద్రబాబు హామీ.. ఎమ్మెల్యే ఆనందరావు విజ్ఞప్తికి సానుకూల స్పందన**

**కాలువలు, లాకుల ఆధునికీకరణ - చివరి ఆయకట్టుకు సకాలంలో సాగునీరు - డ్రైనేజీ వ్యవస్థకు మహర్దశ - రైతాంగానికి భారీ ప్రయోజనం**

**అమలాపురం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలో సాగునీటి వ్యవస్థను ఆధునికీకరించి, రైతాంగానికి మరింత మెరుగైన సాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. సెంట్రల్ డెల్టా ఆధునికీకరణ పనుల కోసం రూ.3,000 కోట్లను కేటాయించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చేసిన ప్రత్యేక విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. కోనసీమ ప్రాంతంలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న సాగునీటి సమస్యలు, ముంపు ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలంటే సెంట్రల్ డెల్టా ఆధునికీకరణ అత్యవసరమని ఎమ్మెల్యే ఆనందరావు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన కాలువలు, బ్రాంచ్ కాలువలు, లాకులు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధితో పాటు చివరి ఆయకట్టు భూములకు కూడా సమృద్ధిగా సాగునీరు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రూ.3,000 కోట్ల నిధులతో ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు హామీ ఇచ్చారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రధాన కాలువలు, బ్రాంచ్ కాలువలు, శిథిలావస్థకు చేరిన లాకులు, ఇతర నీటి నియంత్రణ వ్యవస్థలను సమగ్రంగా పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఆనందరావు పేర్కొన్నారు.



ఆధునికీకరణ నిధులతో కాలువల పూడికతీత, మరమ్మతులు, అవసరమైన ప్రాంతాల్లో లైనింగ్ పనులు చేపట్టడం ద్వారా నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచే అవకాశం ఉంటుందని తెలిపారు. డెల్టా పరిధిలోని చివరి ఆయకట్టు భూములకు కూడా సకాలంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవడం ఆధునికీకరణలో ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆనందరావు కోరారు. కాలువల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు నీటి సరఫరాలో ఎదురవుతున్న అవరోధాలను తొలగిస్తే చివరి భూముల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. కోనసీమలో వర్షాకాలంలో, వరదల సమయంలో ముంపునకు గురయ్యే లంక గ్రామాలు, లోతట్టు ప్రాంతాలు, వ్యవసాయ భూములకు రక్షణ కల్పించేందుకు డ్రైనేజీ వ్యవస్థను కూడా ఆధునికీకరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఆనందరావు వివరించారు. డ్రైనేజీల ప్రవాహ సామర్థ్యాన్ని పెంచి, ముంపు నీరు వేగంగా బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరారు. సెంట్రల్ డెల్టా ఆధునికీకరణ పూర్తయితే ఉమ్మడి గోదావరి డెల్టాలో వరి సాగుతో పాటు ఉద్యానవన పంటలు, ఆక్వా రంగానికి కూడా మెరుగైన నీటి నిర్వహణ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆనందరావు తెలిపారు. సాగునీటి లభ్యత మెరుగుపడటంతో రైతుల ఉత్పాదకత పెరగడంతో పాటు ముంపు సమస్యల వల్ల కలిగే నష్టాలను కూడా గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. కోనసీమ ప్రాంత రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ డెల్టా ఆధునికీకరణకు రూ.3,000 కోట్ల భారీ నిధులు కేటాయించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించడం పట్ల ఎమ్మెల్యే ఆనందరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అమలులోకి వస్తే కోనసీమ సాగునీటి వ్యవస్థకు కొత్త రూపు వస్తుందని, రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. సెంట్రల్ డెల్టా ఆధునికీకరణకు ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే ఆనందరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

### స్థానిక సంస్థల ఎన్నికలకు

# టీడీపీ శ్రేణులు సమరశంఖం పూరించాలి

**పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి**

**టీడీపీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ పిలుపు**



**రామచంద్రపురం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ శ్రేణులంతా పూర్తి స్థాయిలో సంసిద్ధం కావాలని టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పిలుపునిచ్చారు. రామచంద్రపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన నియోజకవర్గస్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త చిత్త శుద్ధితో, సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి కుటుంబాన్ని కలిసి, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్న వాసంశెట్టి సత్యం.. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తించి, వారికి తగిన ప్రాధాన్యత, గౌరవం కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ విజయానికి కృషి చేసే నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో సముచిత గుర్తింపు లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నాయకత్వంలో రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని, ఈ అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పార్టీకి మంచి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు టీడీపీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కార్యాచరణ ప్రారంభించాలని అన్నారు. ప్రతి బూత్‌ను బలోపేతం చేసి, ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకత్వం ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, కాజులూరు మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, కే.గంగవరం మండల అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్ తదితరులు మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీలు,క్లస్టర్, కో-క్లస్టర్, సొసైటీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, యూనిట్, బూత్ స్థాయి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రానున్న ఎన్నికలకు పార్టీని విజయపథంలో నడిపించేందుకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

# వివిధ గ్రాంట్‌ల కింద చేపట్టిన సివిల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా లో వివిధ గ్రాంట్ ల కింద చేపట్టిన సివిల్ పనులను వేగవంతంగా పూర్తి చేసి,ఆయా వసతుల ను ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేశీధిర ప్రసాద్ వివిధ శాఖల ఇంజనీర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లో పంచాయితీరాజ్, ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, రహదారులు-భవనాల శాఖ, కాకినాడ నగరపాలక సంస్థ కు చెందిన ఇంజనీర్ల తో వివిధ గ్రాంట్ ల కింద చేపట్టిన సివిల్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. తొలుత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వ ర్యంలో 15 వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన విలేజ్ క్లినిక్‌ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సీఎస్ఆర్,నాబార్డ్,ఎంపీ ల్యాడ్స్, జాతీయ ఆరోగ్య మిషన్,జిల్లా మినరల్ ఫండ్,ఆసుపత్రి అభివృద్ధి నిధులు తదితర గ్రాంట్ల కింద చేపట్టిన పనులను కూడా వేగవంతం చేసి, నిర్దేశిత పసతులను ప్రజలకు త్వరి తగతిన అందుబాటులోకి తీసుకు రావాలని సూచించారు. వివిధ మండలాల్లో పురోగతి లో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించి ప్రతి పనికి



నిర్దిష్ట గడువులను విధించి, వాటి ప్రకారం పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అభివృద్ధి పనులకు అవసరమై న స్థలాల సేకరణలో ఎదుర వుతున్న సమస్యల పరిష్కా రంపై ఈ నెల 22వ తేదీ శనివారం ఆయా శాఖల అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లా లోని ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్ల తో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఆసుపత్రుల్లో చేపట్టిన సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసరమైన,అత్యధిక ప్రాధాన్యత కలిగిన సేవలను ముందుగా అందు బాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన చేపట్టాలని సూచించారు.స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను మరింత వేగవంతం చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ ఇంజనీర్లను ఆదేశించారు. కాకినాడ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కౌడా) పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఈ నెలాఖరులోగా ప్రారంభించాలని స్పష్టంచేశారు.

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన,ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన తదితర గ్రాంట్ ల కింద మంజూరైన పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద మంజూరైన పనులను ఈ నెలాఖరు లోగా చేయాలని ఆదేశించారు. ఆయుష్ భవనాల నిర్మాణాలు ఎటువంటి జాప్యాలకు తావు లేకుండా చేపట్టాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రత్నాకర్,డివిజనల్ ఇంజనీర్ సిహెచ్. చక్రవర్తి, డీసీహెచ్ఎస్ డాక్టర్ మహేష్,పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రామకృష్ణారెడ్డి, రహదారులు- భవనాల శాఖ కాకినాడ కార్యనిర్వాహక ఇంజనీర్ టి.భార్గవి, పెద్దాపురం కార్యనిర్వాహక ఇంజనీర్ కె.రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# గోశాలకు రూ.10,116 విరాళం అందజేసిన వంటెద్దు బాబి



**అమలాపురం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, అమలాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి పుట్టినరోజు వేడుకలు అమలాపురంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాసరావు సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొని బాబికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా వంటెద్దు బాబి అమలాపురం సావరం సమీపంలోని గౌతమి మహర్షి గోశాలకు రూ.10,116 విరాళాన్ని అందజేశారు. గోవులకు దాణా, గోశాల అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం ఈ మొత్తాన్ని గోశాల అభివృద్ధి కమిటీ సభ్యులు అయిల మల్లీ, కె.వి. మావుళ్లయ్యలకు అందజేశారు. గోశాల నిర్వహణకు తన వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని, గోవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహకరించాలని బాబి కోరారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ బాబికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా బాబి చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింతగా సేవలందించాలని ఆకాంక్షించారు. బాబికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముషిని రామకృష్ణారావు, యార్లగడ్డ రవీంద్ర, కుడిపూడి శ్రీనివాసరావు, దేవరపల్లి రాజేంద్రబాబు, వడ్డీ నాగేశ్వరరావు, ఏలేశ్వరపు రాధాకృష్ణ, అప్పన శ్రీరామకృష్ణ, పేరిశర్మ, మహబూబ్ షకీలా, సుగ్గు ప్రసాద్, మొల్లేటి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు. అలాగే జీఎంసీ బాలయోగి స్టేడియం షటిల్ క్లబ్ క్రీడాకారులు మండేల బాబి, కానూరి అరవింద్, డాక్టర్ సురేష్ బాబు, కూరగాయల శివ, నల్లా శివ, బాబు, వంశీ, గోపి, సిద్ధు, విక్రమ్ తదితరులు బాబిని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

# ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోండి




**కోటనందూరు, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫిజియోథెరపీ సేవలు అవసరమైన పిల్లలకు నాన్ భవిత కేంద్రంలో ప్రతి బుధవారం క్యాంప్ నిర్వహిస్తున్నామని ఎంఈఓ రామ్ శేఖర్ తెలియజేశారు. కాకినాడ జిల్లా కోటనందూరులో నాన్ భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా అమలవుతున్న థెరపీ సర్వీసులను జీరో నుండి 18 సంవత్సరాల పిల్లలకు భవిత కేంద్రం లో ఫిజియోథెరపీ అవసరమయ్యే పిల్లలకు ఉచితంగా చేస్తారని, ఫిజియోథెరపీ అవసరం అయ్యే పిల్లలకు ఫిజియోథెరపీ క్యాంప్ ఈరోజు నిర్వహించడం జరిగిందన్నారు. వారి అవసరాలకు అనుగుణంగా పలు రకాల వ్యాయామాలు చేయించారు. ఈ క్యాంపును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిఆర్పి శేఖర్, ఫిజియోథెరపీ డాక్టర్ టీఎస్ఎస్ సోమేశ్వరరావు, ఐఈఆర్పిఎం నాగ గోవిందు ఆర్.నారాయణరావు విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు ఆయా పాల్గొన్నారు.

# ఘనంగా ప్రముఖ పారిశ్రామికవేత్త కృష్ణాజి జన్మదిన వేడుకలు



**కోటనందూరు, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ పారిశ్రామికవేత్త వైఎస్ఆర్సిపి తుని నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు వెలగా వెంకటకృష్ణాజి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగినవి. కాకినాడ జిల్లా కోటనందూరులో వైసీపీ సీనియర్ నాయకులు వత్సవాయి నారాయణ మూర్తి రాజు ఇంటి వద్ద కొరుప్రోలు కృష్ణ అధ్యక్షతన జరిగిన కృష్ణాజి జన్మదిన వేడుకలకు ఎంపీపీ లగుడు శ్రీనివాస్, వైసీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, సీనియర్ నాయకులు వేముల రాజబాబు, నల్లమిల్లి గోవిందు, సుర్ల రాజు తదితరులు హాజరయ్యారు. కృష్ణాజికి అభిమానులు బంధుమిత్రులు శ్రేయోభిలాషులు ఉదయం నుండి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీపీ శ్రీనివాస్ కృష్ణ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణాజి నిరాడంబరముగా జీవించే వ్యక్తి అని ఎంత ఎదిగినా ఒదిగే గుణాలు కలిగి ఉన్న ఈయన పేదలకు సహాయ సహకారాలు అందిస్తూ ఉంటారని, అలాగే వైఎస్ఆర్సిపి పార్టీ కోసం ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఈయన నిండు నూరేళ్లు ఆయుష్షు ఆరోగ్యం ఐశ్వర్యాలతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరము కృష్ణాజి మాట్లాడుతూ నా పుట్టినరోజు వేడుకలు ఇంత ఘనంగా జరిపించిన మిత్రులు శ్రేయోభిలాషులు వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిగటాల కోట సత్తిబాబు, ఏడిద రవి, దార్ల సూర్యచంద్ర,మళ్ల సూర్యచంద్ర, ముక్కుడుపల్లి బాబురావు, ఉల్లూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతపై పోలీసుల అవగాహన

**పసలపూడి జెడ్‌పీ హైస్కూల్‌లో "డ్రగ్స్ వద్దుబ్రో" కార్యక్రమం**

**విద్యార్థులకు పలు సూచనలు చేసిన సిఐ పి.దొరరాజు**



**రాయవరం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు సూచించారు. రాయవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో గల పసలపూడి జెడ్‌పీ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమం ద్వారా వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలపై నేరాలు , పోక్సో చట్టం, మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన అంశాలను వివరిస్తూ శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా ఏదైనా సహాయం అవసరమైనప్పుడు 112కు కాల్ చేయాలని సీఐ దొరరాజు సూచించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల ప్రారంభ, ముగింపు సమయాల్లో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఈగల్ టీమ్ ఏఎస్సై అప్పారావు, పీసీలు గణయ్య, రవికిషోర్, పాఠశాల హెచ్ఎం జోసెఫ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాకినాడ పోర్టును

# జాతీయ రహదారి 216తో అనుసంధానం

### నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణానికి కసరత్తు..



**కాకినాడ, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ పోర్టు దక్షిణ ద్వారం నుంచి ఉప్పలంక వద్ద ఉన్న జాతీయరహదారి వరకుసుమారు5కిలోమీటర్ల మేర ఈ కొత్త రహదారి ని నిర్మించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ పోర్టు దక్షిణ ప్రాంతం నుండి జాతీయ రహదారి సంఖ్య 216 వరకు నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని నిర్మించేందుకు బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన.. భాగస్వామ్య శాఖ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ రహదారుల సంస్థ అధికారి బి. కృష్ణమూర్తి.. ఈకాకినాడ పోర్టు దక్షిణ ప్రాంతం నుండి జాతీయ రహదారి 216 వరకు నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని నిర్మించే ప్రాజెక్టు కు సంబంధించి గత జూలై నెల లో గౌరవ ప్రజాప్రతినిధుల తో నిర్వహించిన మొదటి సమావేశంలో సూచించిన సూచనలు,ఇందుకు అను గుణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించిన వివరాల సమగ్ర నివేదికపై ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. కాకినాడ పోర్టు దక్షిణ ద్వారం నుంచి ఉప్పలంక వద్ద ఉన్న జాతీయ రహదారి వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర ఈ కొత్త రహదారిని నిర్మించడంజరుగుతుందన్నారు.ప్రస్తుతం పోర్టు నుండి వచ్చే సరుకు రవాణా వాహనాలు కాకినాడ నగరం గుండా సుమారు 27 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని,దీనివల్ల సమయం,రవాణా ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. కొత్తగా నిర్మించనున్న ఈ ఐదు కిలోమీటర్ల రహదారి వల్ల రవాణా దూరం 22 కిలోమీటర్లు తగ్గడమే కాకుండా,ప్రయాణ సమయం 30 నుండి 40 నిమిషాల వరకు ఆదా అవుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ ప్రాజెక్టు ద్వారా నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు,రహదారి భద్రత మెరుగుపడటం,ఇంధన ఆదా,పర్యావరణకాలుష్యం తగ్గడం,స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ రహదారి మార్గనిర్ణయం, భూసేకరణ వంటి అంశాల లో పర్యావరణ, చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు.

ఈ సమావేశంలో కాకినాడ పోర్టు, రైల్వే, అటవీ, మత్స్యశాఖ అధికారులు సూచించిన సూచనలను.. ఎన్.హెచ్.ఏఐ అధికారులు సిద్ధం చేసిన అలైన్మెంట్ తో మరోక దఫా సరిచూసు కోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. సంబంధితశాఖాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పే నాయక్ ఇతర భాగస్వామ్య శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాజులూరు మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్

# అధ్యక్షుడిగా చెల్లుబోయిన రాంబాబు





**కాజులూరు, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీవిద్యనికేతన్ కరస్పాండెంట్ చెల్లుబోయిన రాంబాబు ఎన్నికయ్యారు. కాజులూరు మండలం గొల్లపాలెం తిరుమల ఫంక్షన్ హాల్ నందు మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా చెల్లుబోయిన రాంబాబు (శ్రీ విద్యానికేతన్, స్కూల్, గొల్లపాలెం), కార్యదర్శిగా ఫిరోజ్ (ఉషోదయ స్కూల్, గొల్లపాలెం), కోశాధికారి గా పేరూరి కేతన్ ప్రిన్స్ (కాకతీయ స్కూల్ గొల్లపాలెం)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం యూనియన్ అధ్యక్షుడు చెల్లుబోయిన రాంబాబు మాట్లాడుతూ సభ్యులు తమపై పెట్టిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తామని యూనియన్ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ లు స్టీఫెన్ బాబు, డివివిఎస్ఎన్ మూర్తి, తిరగాటి కిషోర్, దేగల రాంబాబు, గుబ్బల నాగేంద్ర కుమార్, కాదా కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## పలు సమస్యలపై

# అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే దివ్య

### కోన ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలి

### ఏలేరు బెడ్ లెవెల్ పనులకు అనుమతి ఇవ్వాలి : తుని ఎమ్మెల్యే యనమల దివ్య



**కోటనందూరు, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, తొండంగి మండలంలోని సముద్రతీరంలో చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్న మత్స్య కారుల కోసం కోనలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ తుని ఎమ్మెల్యే యనమల దివ్య ప్రభుత్వాన్ని కోరారు.ఇవాళ అసెంబ్లీలో ఈవిషయాన్ని ప్రస్తావించిన ఆమె శాసనసభ ద్వారా గంగపుత్రుల మనోగతాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళారు.సంపద సృష్టిలో చేపల వేట కూడ ప్రధానమైందని మత్స్య సంపద ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తున్న గంగపుత్రుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక రాయితీలు ప్రోత్సహకాలు అందిస్తున్న తీరు అభినందనీయమని యనమల దివ్య పేర్కొన్నారు. అయితే పడవలు ఉంచడానికి ఎలాంటి సదుపాయం లేదని చేపల నిల్వ ఉంచుకునేందుకు కూడ సదుపాయం లేక దీన స్థితిని ఎదుర్కొంటున్న జాలర్ల కోసం కోనలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

#### ఏలేరు బెడ్ లెవెల్ కట్టడాలకు యనమల దివ్య వినతి

ఏలేరు జలాలు శివారు భూములకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ యనమల దివ్య కోరారు.ఈవిషయాన్ని ఇవాళ అసెంబ్లీలో ప్రస్తావించిన ఆమె ఏలేరు కాల్వలకు బెడ్ లెవెల్స్ లేనందున ఆయుకట్టు శివారు ప్రాంతమైన తొండంగి మండలానికి అందడం లేదని రైతుల సేద్యపు అవసరాలను తీర్చేందుకు తక్షణమే బెడ్ లెవెల్ పనులు పూర్తి చేయాలని జలవనరుల శాఖ మంత్రిని కోరారు.అదేవిధంగా పంపా రిజర్వాయర్ పై ఉన్న పక్కపోటు కెనాల్ కు వైడింగ్ మరియు డిస్టిలేషన్ లేకపోవడం వల్ల తొండంగి మండలంలోని కృష్ణాపురం నుండి వేమవరం వెంబడి ఉన్న జిల్లేడిపాడు,పైడికొండ,కొత్తపేట,ఎల్లయ్యపేట,ముసలయ్యపేట తదితర గ్రామాలు ముంపుబారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల డిమాండ్ మేరకు పక్కపోటు కెనాల్ వైడింగ్ పనులు చేపట్టాలని యనమల దివ్య కోరారు.

# ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న యనమల గార్డెన్



### ప్రారంభమైన మహా వరుణ యాగం







**కోటనందూరు, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** యనమల గార్డెన్స్ భక్తిరసమయంతో ఆధ్యాత్మిక శోభతో పులకరించింది. వరుణకటాక్షం కోసం యనమల గార్డెన్స్ లో మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ విప్ యనమల దివ్య సారధ్యంలో తలపెట్టిన మహా వరుణ యాగం ఆరంభమైంది. సమాజ శ్రేయస్సు కోసమూ,రైతు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షతో వరుణ కటాక్షం కోసం నాలుగు రోజుల పాటు జరిగే మహా వరుణయాగానికి యనమల దంపతులు ఇవాళ అంకురార్పణ గావించారు. రైతు ప్రతినిధులు చిటికెల శ్రీనివాసరావు దంపతులు,పోతల సూరిబాబు, తమరాన సత్యనారాయణ, తమరాన రామకృష్ణ వరలక్ష్మీ,దర్భా శ్రీనివాస్,కుర్రా వెంకటరమణ,అత్తి వెంకట సుబ్బారావు,యామల అప్పారావు దంపతుల వరుణయాగం ఫలించి సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ యనమల దంపతులు జ్యోతి ప్రజ్వలన గావించారు.ఋత్వికులను ఆహ్వానించి వరుణయాగం దిగ్విజయం కావాలని పూజా కార్యక్రమాలకు శుభారంభం చేసారూ యనమల దంపతులు. అనంతరం ఋత్వికులు వేదమంత్రోచ్చారణలతో గణపతిపూజ,పుణ్యాహవచనం వంటి పూజాకార్యక్రమాలు నిర్వహించారు.త్రయాహ్నిక దీక్ష యాగంలో భాగంగా తొలిరోజు పూజాకార్యక్రమాలు భక్తిరసమయం చేసాయి. ఋత్వికులు పుష్యంగ మహర్షి విగ్రహం ప్రాణప్రతిష్ట గావించి జపములు అభిషేకాలు నిర్వహించగా ఆరుగురు వేదపండితులు జలజపం గావించారు.ఈఅపూర్వ ఆద్యాత్మిక ఘట్టాన్ని వీక్షించేందుకు నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన వచ్చిన ప్రముఖులు, రైతులతో యనమల గార్డెన్స్ భక్త జనసంద్రమైంది.

# స్థానిక సంస్థలు, పురపాలక ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా సన్నద్ధం కావాలి

### అమరావతి నుండి జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారాఎన్నికల సన్నద్ధతపై కాలపరిమితితో కూడిన కార్యాచరణకు దిశానిర్దేశం



**కాకినాడ, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** త్వరలో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ సర్పంచ్,ఎంపీటీసీ,జడ్పీటీసీ, పురపాలక ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ల రూపకల్పన,పోలింగ్ కేంద్రాల గుర్తింపు, మౌలిక వసతుల కల్పన తదితర ఎన్నికల సన్నద్ధత కార్యక్రమాలను నిర్దేశిత కాలపరిమితి లో పూర్తి చేసి, ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల అధికారి అనిల్ చంద్ర పునీత,రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి డా. ఏ. మల్లికార్జున,మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనరేట్ డైరెక్టర్ పి.సంపత్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. స్థానిక సంస్థలు,పురపాలక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటర్ల జాబితా రూప కల్పన నుంచి పోలింగ్ కేంద్రాల గుర్తింపు,తనిఖీ, మౌలిక వసతుల కల్పన వరకు చేపట్టాల్సిన ప్రతి కార్యక్రమాన్ని కాలపరిమితి తో పూర్తి చేయాలని అమరావతి నుండి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల అధికారులు దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎంపీడిఓలు,పంచాయితీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల సన్నద్ధతపై పలు కీలక సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 385 గ్రామ పంచాయతీలు,5 పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఎన్నికల నిర్వహణ కు అత్యంత కీలకమైన ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఓటర్ల జాబితా రూపక ల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మొదటి దశలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల నమో దు, సంబంధిత వివరాల సేకరణ కోసం ఇంటింటి సర్వే ప్రక్రియ ఆగస్టు 18వ తేదీ నుంచి ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఈ ప్రక్రియ పై పూర్తి అవగాహన కలిగి, అత్యంత ఖచ్చితత్వంతో ఓటర్ల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితానే భవిష్యత్తులో రిజర్వేషన్లు,సీట్ల కేటాయింపులకు కీలక ప్రాతిపదికగా ఉంటుందని, అందువల్ల ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా జాబితాలను రూపొందించాలని స్పష్టం చేశారు.ఓటర్ల కుల ధృవీ కరణ ప్రక్రియలో అవసరమైన సహాయాన్ని రెవెన్యూ శాఖ, గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్వోల నుంచి పంచాయతీ కార్యదర్శులు పొందాలని సూచించారు. ఇంటింటి సర్వే ప్రక్రియను ఆగస్టు 22 నాటికి పూర్తి చేయాలని,ఆగస్టు 23,24 తేదీలలో సంబంధిత మార్కింగ్ కాపీలను సమగ్రం గా సిద్ధం చేయాలని ఆదేశించారు.ఆగస్టు 25న ముసాయిదా ఓటర్ల జాబితాను సంబంధిత పంచాయతీ నోటీసు బోర్డులపై ప్రదర్శించాల న్నారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉన్నవారు ఆగస్టు 26, 27, 28 తేదీ లలో సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా సమర్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అందిన అభ్యంతరాలపై ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు (ఐదు రోజులపాటు) విచారణ నిర్వహించి, నిబంధనల ప్రకారం తగిన నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సెప్టెంబర్ 3 నుంచి 6 వరకు గ్రామసభల ద్వారా ఓటర్ల జాబితాను చదివి వినిపించి, ధ్రువీకరణ (వాలిడేషన్) ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 7 నాటికి తుది ఓటర్ల జాబితాను ప్రకటించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఎంపీడిఓ లు ఈ చట్ట బద్ధమైన ప్రక్రియను అత్యంత బాధ్యతతో పర్యవేక్షించాలని, ప్రతి 2 నుంచి 3 గంటలకు ఒకసారి క్షేత్రస్థాయి పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు

**పోలింగ్ కేంద్రాల తనిఖీ, మౌలిక వసతుల కల్పన**

జిల్లాలో మొత్తం 4,554 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.ప్రతి మండలం లో సుమారుగా 150 నుంచి 200 వరకు పోలింగ్ కేంద్రాలు ఉండే అవకాశం ఉన్నందున, ఎంపిడిఓలు ఆయా పోలింగ్ కేంద్రాలను స్వయంగా భౌతికంగా పరిశీలించాలని ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన భవనాలు,అనువైన భవనాలు అందుబాటులో లేని పోలింగ్ కేంద్రాలకు ప్రత్యామ్నాయ ప్రదేశాలను గుర్తించి, సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేయాలనిసూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపులు, మరుగుదొడ్లు, తాగునీరు,విద్యుత్ సరఫరా తదితర కనీస మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ర్యాంపులు,మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేని కేంద్రాలలో అవసరమైన సివిల్ పనులకు ఇప్పటి నుంచే ప్రతిపాదనలు రూపొందించి,అనుమతులు పొందిన వెంటనే పనులను ప్రారంభించా లని సూచించారు. ఆగస్టు 21 నాటికి ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను సిద్ధం చేయాలని,ఆగస్టు 23న ప్రచురించాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 26లోపు స్వీక రించి, వాటిపై సమగ్ర పరిశీలన అనంతరం ఆగస్టు 31 నాటికి తుది పోలింగ్ కేంద్రాల జాబితా ను ప్రకటించాలని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల విధుల్లో నిమగ్నమైన అధికారులు,సిబ్బందికి సాధారణ సెలవులు మంజూరు చేయబడవని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ అత్యంత సున్నితమైనది,చట్టబద్ధమైనది గా ఉన్నందున ప్రతి అధికారి,సిబ్బంది బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎంపీడిఓ లు,పంచాయతీ కార్యదర్శులు,రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సన్నద్ధత కార్యక్రమాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరి ష్కరించుకోవాలని సూచించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధికారులు,సిబ్బందికి ఎన్నికల విధులు,నిబంధన లు,ప్రక్రియలపై త్వరలో ప్రత్యేక శిక్షణా కార్య క్రమాలు నిర్వహించను న్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశంలో ఖచ్చితత్వం, పారదర్శకత,సమన్వయానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ వివివి ఎస్ లక్ష్మణరావు,జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు



# నగరంలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలి

## పారిశుద్ధ్యంపై ప్రజల సంతృప్తిని 80 శాతానికి పెంచాలి - అధికారులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశం



**రాజమహేంద్రవరం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** నగర పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచి ప్రజల్లో సంతృప్తి స్థాయిని 68 శాతం నుంచి 80 శాతానికి పెంచేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగం అధికారులతో ఆయన పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పారిశుద్ధ్య పరిస్థితులు, పారిశుద్ధ్య కార్మికుల పనితీరు, చెత్త సేకరణ, డీ-సిల్టింగ్, ఫాగింగ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం పారిశుద్ధ్యంపై ప్రజల్లో 68 శాతం సంతృప్తి ఉందని, దీనిని 80 శాతానికి చేర్చే లక్ష్యంతో అందరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. పారిశుద్ధ్య విభాగంలో రిటైర్మెంట్, మృతిచెందిన తదితర కారణాలతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేస్తూ 79 మంది కార్మికులను కొత్తగా తీసుకున్నామని తెలిపారు. అదనంగా పనిచేస్తున్న 185 మంది కార్మికుల వేతనాలను రూ.6 వేల నుంచి రూ.15 వేలకు పెంచామని వెల్లడించారు. అలాగే వాహనాలపై పనిచేసే సిబ్బంది వేతనాలను కూడా రూ.18,500కు పెంచినట్లు తెలిపారు. నగరంలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి వార్డుకు ప్రత్యేక పారిశుద్ధ్య షెడ్యూల్ రూపొందించి, నిర్దేశిత పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక వారం పూర్తయిన వెంటనే తదుపరి వారంలో అదే క్రమంలో పనులు పునరావృతమయ్యే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. డీ-సిల్టింగ్, ఫాగింగ్, గ్యాంగ్ వర్క్‌తో పాటు ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, డ్రైనేజీల పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ, వారి సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులకు తెలిపారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా నగరంలోని ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని, సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ప్రజల సంతృప్తిని 80 శాతానికి పెంచే లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు.

### డాగురె సురక్ష ఫోటోగ్రాఫర్ కుటుంబానికి భరోసా : చిట్టిబాబు

కోరుకొండలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**కోరుకొండ, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వీడియో,ఫోటోగ్రాఫర్లు డాగురె సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబంతో పాటు మిగిలిన ఫోటోగ్రాఫర్ల కుటుంబాలకు భరోసాగా సహకరించాలని తూర్పుగోదావరి జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చిట్టిబాబు అన్నారు. బుధవారం కోరుకొండ మండలంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల ఫోటోగ్రాఫర్ యూనియన్ అధ్యక్షులు సూరిబాబు ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త చిత్రపటానికి పూలమాలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా నాయకులు విచ్చేసి యూనియన్ ఐకమత్యంతో ముందుకు నడవాలని, ప్రతి ఫోటోగ్రాఫర్ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రతి ఫోటోగ్రాఫర్ కుటుంబానికి భరోసాగా నిలుస్తున్న "డాగురె సురక్ష పథకం"లో ఉంటూ, తోటి ఫోటోగ్రాఫర్ కుటుంబానికి భరోసాగా నిలవవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం కోరుకొండ సీనియర్ ఫోటోగ్రాఫర్ జయగోపాల్ స్టూడియో అధినేత పైల సత్యనారాయణ కుమార్ మృతికి సంతాపం తెలియజేశారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకొని సీనియర్ ఫోటోగ్రాఫర్లకు, ప్రముఖులకు పూలమాలలు వేసి సాల్వో ఘనంగా సత్కరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి ఫోటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

మండపేట మున్సిపాలిటీ

## 30 నుండి 36 వార్డులకు పెంపు

తుది నోటిఫికేషన్ జారీ - నోటీస్ బోర్డులో ప్రకటన



**మండపేట టౌన్, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపాలిటీలో 30 నుండి 36 వార్డులకు పెంపు చేస్తూ ప్రభుత్వం తాజా గా గెజెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం మండపేట పురపాలక సంఘంలోని వార్డుల పునర్విభజనకు ప్రభుత్వం అధికారిక ఆమోదం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన జి.ఒ.ఎం.ఎస్.నెం.64, తేదీ 24.03.2026 సిడిఎంఎ సర్క్యులర్ మేరకు ఇప్పటివరకు ఉన్న 30 వార్డులను 36 వార్డులుగా పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు. కమీషనర్ ౘ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారు తేదీ 15.08.2026న ఆర్.ఒ.సి. నెం.13033/83/2026-ఎ ద్వారా ప్రతిపాదనను ఆమోదించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తేదీ 18.08.2026న గెజెట్ నోటిఫికేషన్ నెం.407 ద్వారా 36 వార్డుల సరిహద్దులను అధికారికంగా ప్రకటించింది.ఈ నోటిఫికేషన్‌ను బుధవారం మున్సిపల్ కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, శాఖా గ్రంథాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు స్వర్ణ వార్డ్ సచివాలయాల్లో ప్రజల సమాచారం కోసం ప్రదర్శించారు.దీనిపై పురపాలక సంఘం కమీషనర్ టీవీ రంగారావు మాట్లాడుతూ గతంలో జారీ చేసిన వార్డుల జాబితా పై వచ్చిన అభ్యంతరాలను ప్రభుత్వం కు నివేదించమన్నారు. మార్పులు చేర్పులు తో తుది వార్డుల సరిహద్దు తో జాబితా మండపేట పుర పాలక సంఘం నోటీస్ బోర్డు లో ప్రకటన విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీ రమ్య, డి ఇ కింతాడ శ్రీనివాస్, సిబ్బంది పాఠంశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంటల బీమా, ఫార్మర్ ఐడీ

## నమోదు చేసుకోవాలి

గడువు పొడిగింపును సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి గౌరీదేవి సూచన



**సీతానగరం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలోని రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా నమోదు చేసుకోవడంతో పాటు ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను పూర్తి చేసుకోవాలని మండల వ్య వ సాయాధికారి గౌరీ దేవి సూచించారు.ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో ఖరీఫ్ పంటల బీమా నమో దు గడువు ఆగస్టు 31వ తేదీ వరకు పొడిగించబడిం ది. గతంలో ఈ గడువు ఆగ స్టు 15వ తేదీ వరకు ఉండే ది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రైతుల వాటా ప్రీమియంగా వరికు ఎకరానికి రూ.570, మినుముకు ఎకరానికి రూ.300 చెల్లించి పంటల బీమా చేసుకోవచ్చు. రైతు లు మీ సేవా కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా లేదా క్రాప్ ఇన్సూరెన్స్ యాప్ ద్వారా స్వయంగా పంటల బీమా నమోదు చేసుకోవ చ్చు.అదేవిధంగా అగ్రి స్టాకు లో భాగమైన ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రస్తుతం భూ యాజమానులు పూర్తి చేసుకోవచ్చు.ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం వా రికి 11 అంకెల యూనిక్యూ ఫార్మర్ ఐడి కేటాయించబ డుతుంది. వ్యవ సాయ శాఖకు సంబంధించిన వి విధ పథకాలు, సేవలు, సబ్సిడీలు మరియు రైతు సంక్షేమ కార్యక్రమా ల అమలులో ఈ ఫార్మర్ ఐడి భవిష్యత్‌లో కీలకంగా ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఫార్మర్ ఐడి భూయాజమానులకు మాత్రమే అందుబాటులో ఉండగా, భవిష్యత్‌లో కౌలుదారులను కూడా ఈ ఫార్మర్ ఐడి వ్యవస్థలోకి తీసుకురావడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రస్తుతం అర్హత ఉన్న భూయాజమానులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ను పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. అవసరమైన సహాయం కోసం సమీపంలోని రైతు సేవా కేంద్రం ను సంప్రదించవచ్చు.కాబట్టి మండ లంలోని రైతులందరూ ఆగస్టు 31లోపు పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవడంతో పాటు, అర్హత ఉన్న భూయాజమానులు ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ కూడా పూర్తి చేసుకుని 11 అంకెల యూనిక్యూ ఫార్మర్ ఐడి పొందాలని సీతానగరం మండల వ్యవసాయాధికారి గౌరీదేవి గారు కోరారు.

## బీసీలకు గుర్తింపు ఇచ్చినది జగనే

టిడిపి మరోసారి మోసం చేస్తుంది : షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అలీ ఖాన్ బాబా



**మండపేట టౌన్, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** బీసీలకు స్థానిక సంస్థల్లో పదవులు కేటాయించిన 13 జిల్లా పరిషత్ చైర్మన్ దక్కించుకుంటే ఆరుగురికి బీసీ చైర్మన్ పదవులు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి దక్కుతుందని షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్ బాబా పేర్కొన్నారు. రిజర్వేషను పేరిట వెనుకబడిన తరగతుల ను మరో సారి మోసం చేసేందుకు చంద్రబాబు నాయుడు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో మండల పరిషత్ ఎన్నికల్లో 636 మండల పరిషత్ అధ్యక్ష పదవుల్లో ఎక్కువ మంది బీసీలు ఉంటే దానికి 308 బీసీ వర్గానికి ఇచ్చారన్నారు. 19 కార్పొరేషన్ లో వైయస్సార్ పార్టీ క్లీన్ చిప్ చేయగా తొమ్మిది మేయర్ పదవులు బీసీలకు ఇచ్చారన్నారు. 87 మున్సిపాలిటీలో 84 మున్సిపాలిటీలు కైవసం చేసుకుంటే చైర్పర్సన్ 44 మందికి ఇచ్చారని దీంతో 53% ఇచ్చారన్నారు. ఇది జగన్మోహన్ రెడ్డి కి బీసీలపై ఉన్న చిత్తశుద్ధి అన్నారు. చంద్రబాబు నాయుడుకి చిత్తశుద్ధి ఉంటే బీసీలను రాజ్యసభ పంపించేవారన్నారు.

## జక్కంపూడికి కృతజ్ఞతలు తెలిపిన ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నెం



**కోరుకొండ, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన అధ్యక్షులు కన్నం శ్రీనివాస్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం రాజమహేంద్రవరం జక్కంపూడి స్వగృహంలో కోరుకొండ మండల వైఎస్ఆర్సిపి ఎస్సి విభాగం నూతన అధ్యక్షుడు కన్నెం శ్రీనివాస్ రాజాను మర్యాదపూర్వ కలిసి,రాజాకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా, శ్రీనివాస్ ను సాల్వతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జక్కంపూడి కుటుంబానికి ఎల్లప్పుడు విధేయుడనై ఉంటానని, అందరితో కలిసి పార్టీని అన్ని విధాల ముందుకు తీసుకువెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజక వర్గం ఎస్సీసెల్ అధ్యక్షుడు గొంతు లక్ష్మణరావు, ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శులు పైడిమళ్ల కిషోర్, గొల్ల అంబేద్కర్,గ్రామ కమిటీ అధ్యక్షులు కందికట్ల యేసు, ఖండవల్లి పెద్దిరాజు, బి.వెంకన్న బాబు, చిన్న రాజారత్నం, పలువురు నాయకులు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించటం పట్ల

## బీసీ నాయకుల హర్షం

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



**మండపేట టౌన్, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ కేబినెట్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై మండపేట నియోజకవర్గ కూటమి బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయం నుంచి కలువపువ్వు సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది బీసీల ప్రభుత్వం అని, వెనుకబడిన వర్గాల రాజకీయ సాధికారతకు ఈ నిర్ణయం పెద్ద అడుగు అని నాయకులు కొనియాడారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణను బీసీ సంఘాలు, కూటమి నేతలు పూర్తిగా స్వాగతించారు. గత ప్రభుత్వ హయాంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేలా, రాజ్యాధికారంలో తగిన భాగస్వామ్యం కల్పిస్తున్నారని నాయకులు తెలిపారు. 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చాక బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారన్నారు. బీసీలకు ద్రోహం చేయడంలో వైకాపా నాయకుడు జగన్ నెంబర్ వన్ అన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచే బీసీలకు అండగా నిలుస్తూ, వారి సంక్షేమం, అభ్యున్నతి, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని వారు పేర్కొన్నారు.

## టీడీపీ పుట్టిందే బీసీల కోసం..

పట్టణ టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ కరీం



**మండపేట టౌన్, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** 2024 ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని కార్యాచరణలోకి తీసుకువచ్చారని మండపేట టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ కరీం అన్నారు. కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందన్నారు. బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టినందుకు షేక్ కరీం హర్షం వ్యక్తం చేశారు. టిడిపి పుట్టిందే బీసీల అభ్యున్నతి కోసం అన్నారు.రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీసీ వర్గాలన్నీ తెలుగుదేశం పార్టీ కుటమి ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ప్రత్యేకాధికారి



**రాయవరం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి, తూర్పుగోదావరి జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాతి బుజ్జి బుధవారం రాయవరం మండలంలోని మాచవరం, సోమేశ్వరం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే ఓటర్ల జాబితాల్లో కుల ధృవీకరణ ప్రక్రియను పరిశీలించి, సంబంధిత అంశాలపై పంచాయతీ అభివృద్ధి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.వి.ఎస్.ఎస్. సూర్యనారాయణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో ఎం. శ్రీనివాసరావు, మండల స్వర్ణ గ్రామ అధికారి వి.వి.ఆర్. కృష్ణంరాజు, పంచాయతీ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ జగన్‌ను కలిసిన దూలం వెంకన్న బాబు



**మండపేట మండలం, ఆగస్టు 19, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిశీలకులు దూలం వెంకన్నబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై చర్చించారు. మండపేట, రాజమహేంద్రవరం నియోజకవర్గల్లో పార్టీ విజయానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జగన్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జగన్ ను దూలం వెంకన్న బాబు శాలువ తో సత్కరించారు. ఈ కార్యక్రమం లో రాజమహేంద్రవరం రూరల్ వైసిపి ఇన్ ఛార్జ్ చెల్లు వేణు, విద్యార్థి విభాగం నాయకులు అబ్బిరెడ్డి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.




11 లక్షల బడ్జెట్... కోట్లలో వ్యూస్!..

# యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న బాసింగా బలాలు సాంగ్..




ప్రస్తుతం యూట్యూబ్ ప్రపంచాన్ని తెలంగాణ ఫోక్ సాంగ్స్ ఏలేస్తున్నాయి. ప్రతి వారం కొత్త కొత్త పల్లె పాటలు సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతున్నాయి. సినిమా పాటలకు మించిన క్రేజ్, మిలియన్ వ్యూస్ అందుకుంటున్నాయి. అయితే లక్షలు పెట్టిన తీసిన ఈ పాటలు ఇప్పుడు నిర్మాతలకు కోట్ల వర్షం కురిపిస్తున్నాయి. ప్రస్తుతం యూట్యూబ్ వరల్డ్ షేక్ చేస్తున్న సాంగ్ బాసింగా బలాలు. ఈ పాటకు ఎంత రెవెన్యూ వచ్చిందో తెలుసుకుందామా. తెలంగాణ ఫోక్ సాంగ్స్.. కేవలం రాష్ట్రం కాదు.. ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తున్నాయి. దేశాలు దాటి మరి పాపులర్ అవుతున్నాయి. యూట్యూబ్, సోషల్ మీడియాలో ఎక్కడ చూసిన బాసింగా బలాలు సాంగ్ మారుమోగుతుంది. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఈ పాటలకు స్టెప్పులేస్తున్నారు. ఇందుకు సంబంధించిన రీల్స్, షార్ట్స్ నెట్టింట ఏ రేంజ్ లో హల్చల్ చేస్తున్నాయో చెప్పక్కర్లేదు. అచ్చమైన తెలంగాణ యాస, పల్లెటూరి పదాలు, సింపుల్ ట్యూన్, క్యాచీ బీట్ తో ఉండే పాటలు ఇప్పుడు యువతను తెగ ఆకట్టుకుంటున్నాయి. ఇక ఇటీవల నెట్టింట తెగ ఫేమస్ అయిన సాంగ్ బాసింగా బాలలే. ఈ పాటకు యూట్యూబ్ లో వస్తున్న రెస్పాన్స్ గురించి చెప్పక్కర్లేదు. ఫోక్ డ్యాన్సర్స్ ఈశ్వర్ సాయి, వైష్ణవి జంటగా కనిపించిన ఈ పాటకు ఇప్పటికే 86 మిలియన్ వ్యూస్ వచ్చాయి. కేవలం రెండు నెలల్లో ఈ స్థాయిలో వ్యూస్ రావడమంటే అంత మాములు విషయం కాదు. ఈ పాటకు శేఖర్ వైరస్ కొరియోగ్రఫీ అందించగా.. ఈశ్వర్ సాయి, వైష్ణవి ఇద్దరూ తమ చక్కటి సింపుల్ డ్యాన్స్ స్టెప్పులతో ఆకట్టుకున్నారు. సినిమా పాటలకు మించిన క్రేజ్ ఇప్పుడు ఈ పాట సొంతం చేసుకుంది. ఇదెలా ఉంటే.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శేఖర్ వైరస్ మాట్లాడుతూ ఈ పాటకు కొరియోగ్రఫీ చేయడానికి దాదాపు 11 లక్షలు బడ్జెట్ అయ్యిందని తెలిపారు. ఈ 11 లక్షల బడ్జెట్‌లో నటీనటులు (ఆర్టిస్టులు), కొరియోగ్రాఫర్, డీఓపి రెమ్యూనరేషన్లతో పాటు లొకేషన్ సెటప్, ప్రాపర్టీస్, రిహార్సల్స్, ఆహార ఖర్చులు, ప్రమోషన్స్ బాధ్యతలను సైతం చేసినట్లు తెలిపారు. ఈ సాంగ్ విన్న వెంటనే నచ్చడంతో, సరైన ఆర్టిస్టులను ఎంపిక చేసి నాణ్యమైన అవుట్‌పుట్ కోసం నిర్మాతను ఒప్పించి రెండు నెలలు వేచి చూసి ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేశానని తెలిపారు. ప్రొఫెషనల్ డ్యాన్సర్లే కాకుండా సామాన్య ప్రజలు, ముఖ్యంగా మహిళలు, రీల్స్ చేసేవారు సులువుగా అనుకరించేలా హుక్ స్టెప్స్ కంపోజ్ చేయడమే ఈ పాట సక్సెస్ కావడానికి కారణమని తెలిపారు. అయితే ఈ పాటకు ఎంత రెవెన్యూ వచ్చిందనేది మాత్రం వెల్లడించలేదు. నివేదికల ప్రకారం ఈ పాటకు దాదాపు 25 లక్షలకు పైగానే వచ్చినట్లు తెలుస్తోంది.


# లేడీ సూపర్ హీరో 'మహాకాళి' గ్లింప్స్‌కి డేట్ ఫిక్స్!




టాలీవుడ్ టాలెంటెడ్ దర్శకుడు ప్రశాంత్ వర్మ తనకంటూ సెపరేట్ సినిమాటిక్ యూనివర్స్ ని బిల్డ్ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. అలా తన సినిమాటిక్ యూనివర్స్ ని హను మాన్ తో స్టార్ట్ చేయగా, ఇది తెలుగు సినిమా నుంచి మొదటి సూపర్ హీరో సినిమాగా వచ్చి సెన్సేషనల్ హిట్ అయ్యింది. అయితే లేడీ సూపర్ హీరో సినిమా కూడా ప్రశాంత్ వర్మ నుంచే రాబోతుంది. యువ నటి భూమి శెట్టి లీడ్ రోల్ లో ప్రశాంత్ వర్మ క్రియేట్ చేసిన పాత్రే 'మహాకాళీ'. దర్శకురాలు పూజా కొల్లూరి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ధురంధర్ నటుడు అక్షయే ఖన్నా సాలిడ్ రోల్ చేస్తున్నారు. అయితే నేడు ప్రశాంత్ వర్మ సినిమా సెట్స్ నుంచి అక్షయేపై సినిమా స్టిల్ వదిలి ఈ ఆగష్టు 24న బిగ్ అప్డేట్ వదులుతున్నట్టు ఖరారు చేశారు. ఆరోజున సినిమా తాలూకా గ్లింప్స్ రానున్నట్టు బాలీవుడ్ వర్గాలు ఖరారు చేసాయి. అలాగే రిలీజ్ డేట్ కూడా అందులోనే అనౌన్స్ కానున్నట్టుగా టాక్. సో దీనిపై అప్పుడే ఓ క్లారిటీ రానుంది.

'రాకా'లోకి ఎంటర్ కానున్న


# హాలీవుడ్ స్టార్?




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా ఇప్పుడు నటిస్తున్న అవైటెడ్ చిత్రమే 'రాకా'. యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న ఈ ఇంటర్నేషనల్ లెవెల్ ప్రాజెక్ట్ రెండు భాగాలుగా ఇప్పుడు శరవేగంగా పూర్తవుతుంది. అయితే ఈ సినిమా అల్లు అర్జున్ తో ప్లాన్ చేయడానికి ముందే మరికొందరు బిగ్ స్టార్స్ వద్దకు కూడా వెళ్లిన సంగతి తెలిసిందే. అప్పట్లోనే అట్లీ ఈ సినిమాలో వారితో పాటుగా పాపులర్ హాలీవుడ్ స్టార్ నటుడు విల్ స్మిత్ ని కూడా సినిమాలో పెడుతున్నాడని పలు రూమర్స్ వచ్చాయి. తర్వాత ఐకాన్ స్టార్ వద్దకి ఈ సినిమా వచ్చింది. ఇక ఇపుడు సీన్ కట్ చేస్తే ఈ కాంబినేషన్ లో మరోసారి ఆ రూమర్స్ మొదలయ్యాయి. విల్ స్మిత్ రాకా లో జాయిన్ కానున్నట్టు రూమర్స్ ఓ రేంజ్ లో ఇప్పుడు చక్కర్లు కొట్టేస్తున్నాయి. అయితే అప్పుడూ ఇదే టాక్ వినిపించింది ఇప్పుడూ వినిపిస్తుంది. సో ఇది ఎంతవరకు నిజం అనేది వేచి చూడాల్సిందే. ఒకవేళ నిజం అయితే మాత్రం హాలీవుడ్ ఎంట్రీకి టికెట్ దొరికేసినట్టే అనుకోవచ్చు. మరి అట్లీ అండ్ సన్ పిక్చర్స్ టీం ఏం ప్లాన్ చేసారో చూడాలి.

బ్యాడ్ లక్.. ఆ ఒక్క కారణంతో నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాను

# రిజెక్ట్ చేసిన హీరో రాజ్ తరుణ్



ఒకప్పుడు యూత్ ఫుల్ లవ్ స్టోరీలతో ఆకట్టుకున్న హీరో రాజ్ తరుణ్ ఇప్పుడు వరుస ఫ్లాప్ లతో సతమతమవుతున్నాడు. వరుసగా సినిమాలు, వెబ్ సిరీస్ లు చేస్తున్నా సక్సెస్ మాత్రం అందుకోలేకపోతున్నాడీ యంగ్ హీరో. అయితే ఇందుకు రాజ్ తరుణ్ తీసుకున్న నిర్ణయాలు కూడా ఒక కారణమని తెలుస్తోంది. రాజ్ తరుణ్.. ఒకప్పుడు ప్రేమ కథా చిత్రాలు, యూత్ ఫుల్ స్టోరీలతో క్రేజీ హీరోగా గుర్తింపు తెచ్చుకున్నాడు రాజ్ తరుణ్. ఉయ్యాల జంపాల సినిమాతో ఇండస్ట్రీకి హీరోగా పరిచయమైన రాజ్ తరుణ్ కుమారి 21 ఎఫ్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్నాడు. ఆ వెంటనే సినిమా చూపిస్తా మావా తో మరో హిట్ ఖాతాలో వేసుకున్నాడు. ఈడో రకం ఆడో రకం, నాన్న నేను బాయ్ ఫ్రెండ్స్, కిట్టు ఉన్నాడు జాగ్రత్త, అందగాడు, రాజుగాడు, లవర్, ఇద్దరి లోకం ఒకటే, ఒరేయ్ బుజ్జిగా, పవర్ ప్లే తదితర సినిమాలతో మినిమం గ్యారెంటీ హీరోగా మారిపోయాడు రాజ్ తరుణ్. అయితే ఆ తర్వాత వరుస పరాజయాలు ఎదుర్కొన్నాడీ యంగ్ హీరో. అనుభవించు రాజా, స్టాండప్ రాహుల్, పురుషోత్తముడు, తిరగబడరా సామీ, భలే ఉన్నాడే, చిరంజీవ , పాంచ్ మినార్ సినిమాలు పెద్దగా ఆడలేదు. దీంతో నా సామి రంగా వంటి మల్టీ స్టారర్ సినిమాల్లో నటించాడు రాజ్ తరుణ్. స్టార్ హీరో రేంజ్ కు వెళ్లాల్సిన రాజ్ తరుణ్ ఇప్పుడు రేసులో బాగా వెనకపడిపోయాడు. దీనికి తోడు వ్యక్తిగత జీవితంలో తలెత్తిన ఇబ్బందులు ఈ ట్యాలెంటెడ్ హీరో గ్రాఫుని తగ్గించేశాయి. ఇదిలా ఉంటే ఈ పరిస్థితికి రాజ్ తరుణ్ తీసుకున్న నిర్ణయాలు కూడా ఒక కారణమని తెలుస్తోంది. ముఖ్యంగా సినిమాల సెలెక్షన్ లో రాజ్ తరుణ్ తప్పటడుగులు వేశాడు. గతంలో దిల్ రాజు ప్రొడక్షన్ లో శర్వానంద్ హీరోగా వచ్చిన 'శతమానం భవతి' సినిమా కథని మొదట రాజ్ తరుణ్ కోసం అనుకున్నారట. అతనికి కథ కూడా వినిపించారు. ఇక అతనే హీరోగా అఫీషియల్ అనౌన్స్ మెంట్ కూడా చేద్దామనుకున్నారట. అయితే ఇంతలోనే రాజ్ తరుణ్ మేనేజర్ రాజా రవీంద్ర ఆ కథ అంత ఎఫెక్టివ్ గా లేదనడంతో రాజ్ తరుణ్ ఈ సినిమా నుంచి పక్కకు తప్పుకున్నాడట. కట్ చేస్తే.. శతమానం భవతి సినిమా కథ శర్వానంద్ దగ్గరకు వెళ్లడం బ్లాక్ బస్టర్ అవ్వడం తెలిసిందే. అంతేకాదు ఈ సినిమాకు నేషనల్ అవార్డు కూడా వచ్చింది. శతమానం భవతి సినిమా కథను రాజ్ తరుణ్ కంటే రాజా రవీంద్రనే రిజెక్ట్ చేశాడట. ఈ విషయాన్ని అతనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. మొత్తానికి తన తొందరపాటు నిర్ణయంతో ఒక నేషనల్ అవార్డ్ విన్నింగ్ సినిమాను చేజేతులా వదులుకున్నాడు రాజ్ తరుణ్. ఒకవేళ అతను గనక ఈ సినిమాను చేసి ఉంటే అతని కెరీర్ కు మంచి హెల్ప్ అయ్యేదని సినీ అభిమానులు అభిప్రాయ పడుతున్నారు.

హాకీ ప్రపంచ కప్..

# పాకిస్థాన్‌పై భారత్ విజయం



హాకీ ప్రపంచకప్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన పూల్ డి మ్యాచ్‌లో భారత్ 5-3 తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత్ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించగా.. పాక్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. హర్మన్‌ప్రీత్, అభిషేక్ చెరో రెండు గోల్స్ కొట్టి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించారు. తొలి అర్ధ భాగంలో భారత్ నాలుగు గోల్స్‌తో అదరగొట్టగా.. పాక్ రెండు గోల్స్ చేసింది. రెండో అర్ధ భాగంలో ఇరుజట్లు చెరో గోల్ మాత్రమే చేశాయి. మ్యాచ్ ప్రారంభమైన 5వ నిమిషంలో హర్మన్‌ప్రీత్.. 11వ నిమిషంలో అభిషేక్ గోల్ చేశారు. రెండో క్వార్టర్‌లో హర్మన్‌ప్రీత్ (21వ), అభిషేక్ (24వ)మళ్లీ చెరో గోల్ కొట్టారు. మూడో క్వార్టర్‌లో హార్దిక్ సింగ్ (35వ నిమిషం) గోల్ చేయడంతో భారత్ ఆధిక్యం మరింత పెరిగింది. పాక్ తరఫున హన్నన్ షాహిద్ (22వ, 46వ), సుఫ్యాన్ ఖాన్ (24వ) గోల్స్ సాధించారు. ఆఖరి క్వార్టర్‌లో ప్రత్యర్థి జట్టు ఒత్తిడి పెంచడంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది. కానీ, భారత్ సంయమనం కోల్పోకుండా రెండు గోల్స్ ఆధిక్యాన్ని కాపాడుకుని విజయం సాధించింది.

# టెస్టు విజయాలు అంత సులభంగా రావు : శుభ్‌మన్ గిల్



శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టీమ్ఇండియా ఐదో స్థానంలోనే కొనసాగుతున్నప్పటికీ.. విజయాల శాతాన్ని 53.33కి పెంచుకుంది. ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఇంకా ఎనిమిది మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో ఆరు మ్యాచ్‌లు గెలిస్తే భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడానికి మెరుగైన అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో శ్రీలంకతో మ్యాచ్ అనంతరం భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆట సాగిన తీరు, డబ్ల్యూటీసీ గురించి మాట్లాడాడు. "ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరడం మా అంతిమ లక్ష్యం. టెస్టు విజయాలు అంత సులభంగా రావు. ఈ గెలుపు ఎంతో ఆనందాన్నిచ్చింది. మాకు ఇది ఎంతో సంతృప్తికరమైన విజయం. మేము ఈ మ్యాచ్‌లో మెరుగైన స్థితిలోనే ఉన్నప్పటికీ వాతావరణ పరిస్థితుల (వర్షం వల్ల) కారణంగా మ్యాచ్ కొనసాగుతుందో లేదోనన్న ఆందోళన కలిగింది. కానీ, మా బౌలర్లు మ్యాచ్‌ను వేగంగా ముగించారు" అని గిల్ పేర్కొన్నాడు. లంకతో తొలి టెస్టులో 10 వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించిన యువ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్‌పై శుభ్‌మన్ ప్రశంసలు కురిపించాడు. సుతార్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడని, చాలా మంచి భవిష్యత్తు ఉన్న ఆటగాడిగా కనిపిస్తున్నాడని పేర్కొన్నాడు. అతను చాలాకాలంపాటు భారత్‌కు ఆడగలడని విశ్వాసం వ్యక్తం చేశాడు. సెంచరీ హీరో, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దేవదత్ పడిక్కల్‌ను కూడా గిల్ ప్రశంసించాడు."అతని ఆట చూడముచ్చటగా ఉంది. సెంచరీలు సాధించడం ముఖ్యమే. కానీ కేవలం సెంచరీతోనే ఆగిపోకుండా అతను భారీ స్కోరు చేశాడు. పడిక్కల్ అక్కడితో సంతృప్తి చెందలేదు. రెండో ఇన్నింగ్స్‌లోనూ రాణించాడు. అతను బ్యాటింగ్ చేసిన తీరు, ఆధిపత్యం ప్రదర్శించిన విధానం

# గాలె సూపర్ హీరో మానవ్ సుతార్..



శ్రీలంకతో తొలి టెస్టులో అదరగొట్టి భారత్‌కు కీలక విజయాన్నందించాడు స్పిన్నర్ మానవ్ సుతార్. ఇటీవల అఫ్గానిస్థాన్‌పై టెస్టుల్లో అరంగేట్రం చేసిన ఈ యువ స్పిన్నర్ తొలి మ్యాచ్‌లోనే ఏడు వికెట్లు పడగొట్టి అందరి దృష్టిని ఆకర్షించాడు. 24 ఏళ్ల సుతార్ (మీఖఅఖజ రాబ్‌ప్రఘతీ).. ఇప్పుడు శ్రీలంక పర్యటనలోనూ ఇరగదీస్తున్నాడు. గాలెలో లంకతో జరిగిన తొలి టెస్టులో ఏకంగా 10 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక అత్యంత అనుభవజ్ఞుడైన బ్యాటర్ దినేశ్ చండీమల్ వికెట్ సహా అద్భుత (4/76) ప్రదర్శన చేశాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో (6/55) చెలరేగిపోయాడు. మొదట్లో రెండు వికెట్లు పడగొట్టిన సుతార్.. తన చివరి 10 బంతుల్లో నాలుగు వికెట్లు తీసి మ్యాచ్‌ను ముగించేశాడు. దీంతో మొత్తం మీద మ్యాచ్‌లో (10/131) పది వికెట్ల ఘనత అందుకున్నాడు. దీంతో హర్భజన్ సింగ్, అశ్విన్‌లను అధిగమించి శ్రీలంకలో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలతో 10 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా మానవ్ సుతార్ నిలిచాడు. అంతేకాదు భజ్జీ, అశ్విన్ తర్వాత శ్రీలంకలో 10 వికెట్ల ప్రదర్శన చేసిన మూడో భారత బౌలర్‌గా ఘనత సాధించాడు. ఈ ముగ్గురూ గాలెలోనే ఈ ఘనత సాధించడం విశేషం. హర్భజన్ 2008లో (10/153), 2015లో అశ్విన్ (10/150) పది వికెట్ల ప్రదర్శన చేశారు.

# ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్..

## ప్రిక్వార్టర్స్‌కు సింధు, ఆయుష్ శెట్టి



దిల్లీ వేదికగా జరుగుతున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు పి.వి.సింధు, ఆయుష్ శెట్టి ప్రిక్వార్టర్స్‌కు చేరారు. లక్ష్యసేన్, ఉన్నతి హుడాలకు చుక్కెదురైంది. మహిళల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో సింధు 21-16, 21-17 తేడాతో వెన్ యు జాంగ్ (కెనడా)ను మట్టికరిపించింది. ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్ 3 వాంగ్ జీ యీతో సింధు తలపడనుంది. ఇక, పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ శెట్టి 21-8, 21-10 తేడాతో దుమిందు అబేవిక్రమ (శ్రీలంక)పై విజయం సాధించి రౌండ్ ఆఫ్ 16కు దూసుకెళ్లాడు. మరోవైపు, పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్‌ను గారెట్ టాన్ (అమెరికా) ఓడించాడు. 21-19తో తొలి గేమ్‌ను లక్ష్యసేన్ గెల్చుకోగా.. రెండో గేమ్‌ను 17-21 తేడాతో అమెరికా షట్లర్ సొంతం చేసుకున్నాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో లక్ష్యసేన్ 17-21తో పోరాడి ఓడాడు. మహిళల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో యువ షట్లర్ ఉన్నతి హుడా కూడా పోరాడి ఓడింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 21-9, 11-21, 21-23తో మిచెల్ లీ (కెనడా) చేతిలో పరాజయం చవిచూసింది. పురుషుల డబుల్స్‌లో ఎంఆర్ అర్జున్-హరిహరన్ జంటకు చుక్కెదురైంది. రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో దక్షిణ కొరియా జంట కాంగ్ మిన్-హ్యుక్-కి డాంగ్-జు చేతిలో 17-21, 14-21 తేడాతో ఓటమి చవిచూసింది. మిక్స్‌డ్ డబుల్స్ జోడీ తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల తమ రెండో రౌండ్ మ్యాచ్‌లో విజయం సాధించి ప్రిక్వార్టర్‌కు చేరుకున్నారు. భారత ద్వయం రౌండ్ ఆఫ్ 32 పోరులో 21-11, 21-11 తేడాతో మకావు జోడీ యోంగ్ ఐయోక్-ఎన్జి వెంగ్‌ని చిత్తు చేసింది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్‌శెట్టి జోడీ కోర్టులోకి అడుగుపెట్టకుండానే రౌండ్ ఆఫ్ 16కు చేరింది. తొలి రౌండ్లో ఈ భారత జంటకు బై లభించగా.. రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో అలెగ్జాండర్ డన్, ఆడమ్ ప్రింగిల్ (స్కాట్లాండ్) తలపడాల్సి ఉండగా.. చివరి క్షణంలో స్కాటిష్ జంట వైదొలగడంతో సాత్విక్-చిరాగ్ ద్వయం తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com